ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

గురువారం 9 జనవరి 2025

సాగునీటి ప్రక్షాళనకు శ్రీకారం

- నేడు ప్రాజెక్టు కమిటీ తొలి సమావేశం
- సత్తెనపల్లి జలవనరులశాఖ అతిథి గృహంలో నిర్వహణ
- కీలక నిర్ణయాలు తీసుకుంటేనే మేలంటున్న రైతులు



8

గోవిందాపురం మైనర్‌లో పెరిగిన రబ్బరు మొక్కలు

గుంతల రహదారికి మోక్షం



గోతుల మయంగా ఉన్న కొండమోడు రహదారి

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా పనులను ప్రారంభించడంతో కొండమోడు - పేరేచర్ల జాతీయ రహదారికి మహర్దశ పట్టనుంది. రహదారి పనులకు నిధులు మంజూరు.. భూసేకరణ.. టెండర్ ప్రక్రియ పూర్తయింది. పనులు ప్రారంభించేందుకు జాతీయ రహదారుల అథార్టీ చర్యలు చేపట్టింది. దశాబ్దాలుగా కొండమోడు రహదారిని విస్తరించాలని వాహనదారులు కోరుతున్నారు. సత్తెనపల్లి - కొండమోడు మధ్య రహదారిపై పెద్దఎత్తున గోతులు ఉన్నాయి. దీంతో ఈ రహదారిపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. ఈ రహదారిలో ప్రయాణించేందుకు వాహనదారులు సాహసించడంలేదు. గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు నరసరావుపేట నుంచి వెళ్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. మొత్తం మీద ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా పనులకు శంకుస్థాపన చేయడంతో రహదారిని వేగవంతంగా విస్తరించేందుకు సాకారం ఏర్పడింది. పేరేచర్ల నుంచి కొండమోడు మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. ఒక్కొక్క వైపు 8.75 మీటర్లు రహదారి నిర్మిస్తారు. 1.5 మీటర్లు డివైడర్.. రెండు వైపులా మార్జిన్లతో కలిపి మొత్తం 22.5 మీటర్ల వెడల్పుతో రహదారిని విస్తరిస్తారు. సుమారు 585 ఎకరాల భూమిని రహదారి విస్తరణ కోసం సేకరించారు. కేంద్ర ప్రభుత్వం రూ.882 కోట్లు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. మేడికొండూరులో సుమారు ఐదు కిలోమీటర్లు, సత్తెనపల్లి పట్టణానికి 11 కిలోమీటర్లు మేర బైపాస్ నిర్మించనున్నారు. కాంట్రాక్టర్‌ను ఖరారు చేయడంతో త్వరలోనే పనులు ప్రారంభంకానున్నాయి.

తీరంలో.. అనుసంధానం



ఎన్‌హెచ్ 216 జాతీయ రహదారి

(బాపట్ల - ఆంధ్రజ్యోతి)

జిల్లా పరిధిలోని 72 కిలోమీటర్ల మేర తీర ప్రాంతాన్ని కలుపుతూ జాతీయ రహదారి 216 విస్తరణ పనులను 2017లో కేంద్రం ప్రారంభించింది. రూ.786 కోట్ల వ్యయంతో 62.13 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టిన ఎన్‌హెచ్ 216 పనులు 2023లో పూర్తి కాగా 2024 నుంచి ప్రజలకు ఉపయోగంలోకి వచ్చింది. ఈ రహదారిని ప్రధాని విశాఖ వేదికగా జాతికి అంకితం చేశారు. రేపల్లె నుంచి ప్రారంభమయ్యే 216 రెండు వరుసల రహదారి భట్టిప్రోలు, చెరుకుపల్లి, కర్లపాలెం, బాపట్లతో పాటు చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెంలను అనుసంధానం చేస్తోంది. ప్రాజెక్టు ప్రారంభించినప్పుడు అంచనా వ్యయం రూ.487 కోట్లుకాగా, నిర్మాణం పూర్తయ్యేనాటికి అది రూ.786 కోట్లకు చేరుకుంది. ఈ రహదారి వల్ల బాపట్లలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పడుతుంది.

వైసీపీ ప్రభుత్వంలో నత్తనడకన..

2017లో ప్రారంభమైన 216 జాతీయ రహదారి పనులు రెండేళ్ల పాటు శరవేగంగా కొనసాగాయి. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో పనుల్లో వేగం లోపించింది. నిర్మాణ పనుల్లో జాప్యంతో తొలి అంచనాలకు మించి ఖర్చు అయింది. దీనికి తోడు భూసేకరణలో కూడా వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరించడం కూడా నిర్మాణ వ్యయం పెరగడానికి కారణమైంది. ప్రారంభించిన మూడేళ్ల వ్యవధిలోనే నిర్మాణం పూర్తి చేయాలని తొలుత లక్ష్యం నిర్దేశించుకున్నప్పటికీ ఎట్టకేలకు గతేడాది అది వాడుకలోకి వచ్చింది.

సాగర్ నుంచి మల్లాయపాలెం వరకు..

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ - దావులపల్లి జాతీయ రహదారిని 47 కిలోమీటర్ల మేర రెండు వరుసలుగా విస్తరించారు. రూ.230 కోట్లతో పనులు పూర్తి చేయగా రహదారిని ప్రధాని ప్రారంభించారు. దావులపల్లి నుంచి ప్రకాశం జిల్లా మల్లాయపాలెం జాతీయ రహదారిని రెండు వరుసలుగా విస్తరించనున్నారు. రూ.312 కోట్లతో 20 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరిస్తారు. ఈ పనులకు కూడా ప్రధాని శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రహదారి నిర్మాణానిక సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. భూసేకరణ పనులు పూర్తయ్యాయి. రహదారి విస్తరణ పనులు వెనువెంటనే ప్రారంభించేందుకు నేషనల్ హైవే అథార్టీ చర్యలు చేపట్టింది.



ప్రధాని ప్రారంభించిన నాగార్జున సాగర్ - దావులపల్లి రహదారి



జిల్లాకు సంబంధించిన వివిధ ప్రాజెక్టులను విశాఖపట్నం నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ప్రధానమంత్రి మోదీ, వేదికపై గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డీప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత తదితరులు

- పలు ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభం.. శంకుస్థాపన
- కొండమోడు రహదారి, నల్లపాడు-బీబీనగర్ డబ్లింగ్‌కు మహర్దశ
- చిలకలూరిపేట బైపాస్, దావులపల్లి, ఎన్‌హెచ్-216 రహదారులు జాతికి అంకితం
- విశాఖపట్టణం నుంచి వర్చువల్‌గా శిలాఫలకాలను ఆవిష్కరించిన మోదీ

జాతికి అంకితం..

జిల్లా అభివృద్ధికి..

ఆవిష్కారం

రహదారులు జాతికి అంకితంతో పాటు వివిధ పనులకు సంబంధించిన శిలాఫలకాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖపట్నం నుంచి బుధవారం ఆవిష్కరించారు. కొండమోడు రహదారి.. నల్లపాడు-బీబీనగర్ డబ్లింగ్.. పనులకు శంకుస్థాపన చేయగా చిలకలూరిపేట బైపాస్, దావులపల్లి, ఎన్‌హెచ్-216 రహదారులు జాతికి అంకితం చేశారు. ఒకే రోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని వివిధ పనుల ప్రారంభోత్సవాలతో పాటు రహదారులను జాతికి అంకితం చేశారు. ఆయా పనులకు సంబంధించిన శిలాఫలకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో కలిసి మోదీ ఆవిష్కరించారు. ప్రధాని స్వయంగా ప్రారంభించడంతో కొండమోడు రహదారితో పాటు నల్లపాడు-బీబీనగర్ డబ్లింగ్ పనులు శరవేగంగా పూర్తి అవుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. కాగా బుధవారం మోదీ పనులకు శంకుస్థాపన దృశ్యాలను గుంటూరు, నడికుడి తదితర రైల్వేస్టేషన్లలో తెరలు ఏర్పాటు చేసి ప్రయాణికులు వీక్షించే సౌకర్యాన్ని కల్పించారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే సరుకు రవాణాతో పాటు రైళ్ల వేగం కూడా పెరిగే అవకాశం ఉంది. దేశంలోనే మొదటి మోడల్ ప్రాజెక్టుగా చేపట్టిన చిలకలూరిపేట బైపాస్ రోడ్డును ప్రధాని జాతికి అంకింతం చేశారు. నాగార్జున సాగర్ - దావులపల్లి జాతీయ రహదారిని నరేంద్ర మోదీ ప్రారంభించారు. దావులపల్లి నుంచి ప్రకాశం జిల్లా మల్లాయపాలెం జాతీయ రహదారిని రెండు వరుసలుగా విస్తరించే పనులకు మోదీ ప్రారంభోత్సవం చేశారు. రేపల్లె నుంచి ఈపూరుపాలెం 216 రహదారితో రేపల్లె, బాపట్ల, చీరాల నియోజకవర్గాలకు అనుసంధానం ఏర్పడింది. బాపట్ల జిల్లా పరిధిలోని 62.13 కిలోమీటర్ల మేర 216 జాతీయ రహదారిని ప్రధాని జాతికి అంకితం ఇవ్వడం పట్ల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

పట్టాలెక్కిన డబ్లింగ్ ప్రాజెక్టు



(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

గుంటూరు రైల్వే డివిజన్ దశ దిశ మార్చబోయే కీలకమైన నల్లపాడు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టు పట్టాలెక్కింది. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి పింక్‌బుక్‌లో చేర్చిన రైల్వే శాఖ బుధవారం ప్రధానమంత్రి శంకుస్థాపన చేయించింది. రూ.2853.23 కోట్ల అంచనా విలువకాగల ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో వేల మందికి ఉపాధి లభించనుంది. అలానే ప్రాజెక్టు పూర్తి అయితే తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ మధ్య రైలు కనెక్టివిటీ గణనీయంగా పెరుగుతుంది. వాణిజ్యపరంగానూ రెండు రాష్ట్రాలలోని గ్రామీణ ప్రాంతాలకు మేలు కలుగుతుంది. నల్లపాడు - బీబీనగర్ మధ్యన ప్రస్తుతం సింగిల్ లేన్ రైలు మార్గం అందుబాటులో ఉన్నది. దీని వల్ల లైన్ కెపాసిటీ 215కి చేరింది. దీంతో కొత్తగా రైళ్లను ప్రవేశపెట్టలేని పరిస్థితి నెలకొన్నది. గత ఏడాది ప్రకృతి విపత్తుల సమయంలో కాజీపేట మార్గానికి ప్రత్యామ్నాయంగా నల్లపాడు - బీబీనగర్ రైల్వేలైన్‌ని వినియోగించడంతో రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడిచాయి. కాగా ఈ మార్గాన్ని డబ్లింగ్ చేయాలని దశాబ్దాల తరబడి ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. ఎట్టకేలకు ఎన్‌డీఏ-3 ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టు మంజూరైంది. 238.99 కిలోమీటర్ల పొడవునా ఈ డబ్లింగ్ ప్రాజెక్టుని చేపడతారు. ఇందులో కృష్ణానదిపై మేజర్ బ్రిడ్జిని కూడా నిర్మించాల్సి ఉన్నది. అలానే వలిగొండ, నాగార్జునసాగర్ లెఫ్ట మెయిన్ కెనాల్, మూసినదిపై వంతెనల నిర్మాణాలు చేయాలి. పగిడిపల్లి నుంచి కుక్కడం వరకు భూమి అందుబాటులో ఉండటంతో మూడు సెక్షన్లుగా విడగొట్టి పనులు చేపట్టేందుకు టెండర్లను కూడా రైల్వే శాఖ నిర్వహించింది. కుక్కడం - నడికుడి, కుక్కడం - వలిగొండ, పగిడ్లి - బొమ్మాయిపల్లి మధ్య ఇప్పటికే భూమి చదును పనులు మొదలయ్యాయి. మరోవైపున నడికుడి - నల్లపాడు మధ్య గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భూసేకరణ చేయాల్సి ఉండగా రెండు జిల్లాల ఆర్‌డీవోలు ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేశారు. రైతుల వద్ద తీసుకోబోయే భూమికి అవార్డులు జారీ చేస్తే పనులు ప్రారంభించడానికి అవరోధాలు తొలగిపోతాయి. కనీసం 80 శాతం భూమి అందుబాటులోకి వస్తే పనులు ప్రారంభిస్తామని రైల్వేవర్గాలు తెలిపాయి.



బైపాస్‌తో కష్టాలకు చెక్

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

చిలకలూరిపేట బైపాస్ రహదారిని ప్రధాని నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు. రూ.907 కోట్లతో బైపాస్ నిర్మించారు. 16వ నెంబరు జాతీయ రహదారి బొప్పూడి సమీపం నుంచి తిమ్మాపురం వరకు బైపాస్ 16.384 కిలోమీటర్ల మేర నిర్మించారు. దేశంలోనే మోడల్ బైపాస్ ఇది. రహదారికి ఇరువైపులా శాశ్విత గోడ నిర్మించారు. బైపాస్ విశాలమైన ప్రాంతాల్లో ఒక మోగా వాట్ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను రాత్రి వేళ రహదారిపై ఏర్పాటు చేసిన లైటింగ్‌కు వినియోగిస్తారు. దాదాపు 3,500 మొక్కలు నాటారు. బైపాస్‌తో చికలూరిపేట పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు తీరాయి.

గ్రామాల్లో సంక్రాంతి శోభ

- పిండివంటల ఘుమఘుమలు
- అరిసెలు, లడ్డూ తయారీలో మహిళలు
- హరిదాసుల సందడి
- గ్రామాలకు చేరుకుంటున్న బంధువులు

8

రేపు నృసింహుని.. ఉత్తర ద్వార దర్శనం

- బంగారు దక్షిణావృత శంఖుతో భక్తులకు తీర్థం
- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ సతీశ్‌కుమార్

అమరావతి పనులకు ఆమోదం

- మరో రూ.11,467 కోట్ల పనులకు పరిపాలనా అనుమతులు
- ఇప్పటికే రూ.20 వేల కోట్ల పనులకు ఆమోదం

6



కేవీపీ కాలనీలో అసంపూర్తిగానే పాఠశాల భవనం

సంపూర్ణం అస్తవ్యస్తం

- నాడు నేడు పనులపై ఆడిట్
- కాంట్రాక్టర్ల వెన్నులో వణుకు
- పేరుకు తల్లిదండ్రుల కమిటీలు
- పెత్తనం అంతా నాటి వైసీపీ నాయకులదే
- రూ.కోట్లు ఖర్చుచేసినా.. ఇంకా అసంపూర్తిగానే పనులు

గుంటూరు(విద్య),జనవరి 8(ఆంధ్రజ్యోతి): సర్కారు పాఠశాలల్లో అభివృద్ధి పేరుతో నాటి వైసీపీ ప్రభుత్వం చేపట్టిన "నాడు నేడు" పనులపై ఆడిట్ చేయాలని నిర్ణయించడంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు వణికిపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం గత ప్రభుత్వం "నాడు నేడు పథకం" పేరుతో ప్రారంభించిన పనులు అనేక చోట్ల అసంపూర్తిగానే ఉన్నాయి. రెండు దశల్లోనూ పనులు అస్తవ్యస్తంగా నిర్వహించారు. దీంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. ఫలితంగా నిర్మాణ సామగ్రి అనేక చోట్ల పాడై పోతున్నది. కొన్ని చోట్ల దొంగలపాలవుతున్న ఉదంతాలూ ఉన్నాయి.

అస్తవ్యస్తంగా పనులు అడ్డగోలు నిర్ణయాలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ప్రభుత్వం నాడు నేడు పేరుతో నూతన తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం, తాగునీటి కోసం వాటర్ ప్లాంట్స్, గ్రీన్‌చాక్ బోర్డులు, ఇంగ్లీషు ల్యాబులు, కిచెన్‌షెడ్లు, సైన్స్‌ల్యాబుల నిర్మాణం, విద్యార్థులు, సిబ్బందికి ఫర్నిచర్ సౌకర్యం కల్పించడం, పాఠశాలలకు రంగులు వేయడం తదితర తొమ్మిది రకాల పనుల్ని "నాడు నేడు పథకం"లో చేపట్టాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2 వేలకుపైగా మండల పరిషత్ ప్రాథ మిక పాఠశాలలు, జడ్పీ, ప్రభుత్వ పాఠశాలల్ని ఎంపిక చేశారు. ఇందుకోసం దాదాపు రూ. 1500 కోట్లకుపైగా నిధు లు కేటాయించారు. నిధులు సక్రమంగా ఖర్చుచేయకపో వడంతో ఉమ్మడి జిల్లాలో ఇప్పటికీ 45 శాతంపై పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. వందల సంఖ్యలో భవనాలు ఇంకా వివిధ దశల్లోనే ఉన్నాయి. కొన్ని చోట్ల పునాదుల స్థాయిలో మరికొన్నిచోట్ల శ్లాబ్ పూర్తి అయినా పార్టీషన్, ప్లాస్టరింగ్, విద్యుత్, ప్లంబింగ్ పనులు పూర్తికాలేదు. మరికొన్ని చోట్ల పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. ఇలా వివిధ దశల్లో ఉమ్మడి జిల్లాలో వందల సంఖ్యలో భవనాలు ఉన్నాయి. ఆయా పనులపై తాజాగా ఆడిట్ నిర్వహిస్తారు.

బూడిదలో పోసిన పన్నీరులా నిధులు

పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం తీసుకువచ్చిన నిర్మాణ సామగ్రి అనేక చోట్ల పాడైపోతోంది. ఇసుక, కంకర, డస్ట్ ఇప్పటికే అనేక స్కూల్స్‌లో మట్టిలో కలిసి పోయింది. సిమెంట్‌కు రక్షణ లేకపోడంతో గడ్డకట్టి ఉపయోగించడానికి వీలులేకుండా తయారైంది. ఇక శానిటరీ, ప్లంబింగ్, విద్యుత్ పరికరాలు పాఠశాలల్లోని తరగతి గదుల్లో పేరుకుని పోయి ఉన్నాయి. కొన్ని ఇప్పటికే ధ్వంసం కాగా, మరికొన్ని దొంగల పాలైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా కోట్లాది రూపాలయ ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారిందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అనేక స్కూల్స్‌లో ఇప్పటికి వాటర్‌ప్లాంట్స్ ఇన్‌స్టలేషన్ పూర్తి అయినా వినియోగంలోకి రాలేదు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం ఆడిట్ త్వరగా పూర్తిచేసి అసంపూర్తి పనులు పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పీవీ 13 రాష్ట్రాల ప్రజల ఆకలి బాధ తీర్చారు

● వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు



ఉత్తమ పరిశోధనా సంస్థలకు అవార్డులు అందజేస్తున్న వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు, యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మిదేవి, యూనివర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ

గుంటూరు సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలోని 13 రాష్ట్రాల ప్రజల ఆకలి బాధను తీర్చిన ఘనత ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణకు దక్కుతుందని రాష్ట్ర వ్యవసా యశాఖ కమి షనర్ ఎస్ ఢిల్లీరావు అన్నా రు. డాక్టర్ పీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో వచ్చిన వరి వంగడాలు 13 రాష్ట్రా ల్లోని 14.15 మిలియన్ హెక్టార్లలో సాగు అవుతున్నాయని అన్నారు. ఇంత గొప్ప పరిశోధకులు ఉండటం వ్యవసాయ యూనివర్సిటీ అదృష్టం అన్నారు. గుంటూరు సమీపంలోని లాంలో ఉన్న ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కృష్ణా ఆడిటోరియంలో రెండు రోజుల పాటు జరగనున్న 54వ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాలు బుధవారం ఆరంభం అయ్యాయి. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన ఢిల్లీరావు మాట్లాడుతూ శాస్త్రవేత్తలు సునిశిత పరిశీలనతో సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకుంటూ దానికి తగ్గ పరిశోధనని నూతనంగా ఆలోచించి పరిష్కారం చూపించాలని అన్నారు. వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మిదేవి మాట్లాడుతూ 2023లో విశ్వవిద్యాలయం నుంచి తొమ్మిది కొత్త వంగడాలు రాష్ట్రస్థాయిలోనూ, 10 కొత్త వంగడాలు జాతీయస్థాయిలోనూ విడుదల కావడం గర్వకారణమన్నారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివ నారాయణ మాట్లాడుతూ 26 విస్తరణ విభాగాల ద్వారా 2023-24వ సంవత్సరంలో చేపట్టిన వివిధ విస్తరణ కార్యక్రమాల వివరాలను ను తెలియజేశారు. కార్యక్రమంలో ఉత్తమ సామర్థ్యం చూపించిన సంస్థలను గుర్తించి, సత్కరించారు. కొన్ని పుస్తకాలను విడుదల చేశారు. పాడేరు ఏరువాక కేంద్రానికి చెందిన ఎఎస్ఆర్ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఉత్తమ ప్రాంతీయ పరిశోధనాస్థానం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంగా - లాం, గుంటూరు, ఉత్తమ వ్యవసాయ పరిశోధనాస్థానంగా -ఎఆర్ఎస్, రాగోలు, ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రంగా కేవీకే కొండెంపూడి, ఉత్తమ ఏరువాక కేంద్రంగా- ఏరువాక కేంద్రం, ఏలూరు లను గుర్తించి సన్మానించారు. మాజీ పరిశోధన సంచాలకులు డా.ఏ.ఎస్. రావు, మాజీ అసోసియేట్ డీన్ డా.ఆర్.ఎల్.వాసంతి, మాజీ విస్తరణ సంచాలకులు డా.పి.రాంబాబు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్, పెదవేగి నుంచి డా.ఎం.వి. ప్రసాద్, ప్రధాన శాస్త్రవేత్త (విస్తరణ) తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో మరో రూ.11,467 కోట్ల పనులకు ఆమోదం

● 20 ఇంజనీరింగ్ పనులకు పరిపాలనా అనుమతులు
● ఇప్పటికే రూ.20 వేల కోట్ల పనులకు ఆమోదం
● సంక్రాంతి తర్వాత ఊపందుకోనున్న టెండర్ల ప్రక్రియ
● మార్చిలో పనులు ప్రారంభించే అవకాశం



విజయవాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణ పనులకు సంబంధించి మరో రూ.11,467.27 కోట్ల విలువైన పనులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు జారీ చేసింది. రాజధానిలో అత్యంత కీలకమైన 20 ఇంజనీరింగ్ పనులకు బుధవారం ఆమోదం తెలిపింది. అమరావతిలో నిర్మాణ పనులకు సంబంధించి కిందటి కేబినెట్ సమావేశంలో రూ.21 వేల కోట్ల పనులకు ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదం ప్రకారం అందులో సగం రూ.11,467.27 కోట్ల పనులకు తాజాగా పరిపాలనా అనుమతులు జారీ చేసింది. మిగిలిన సగం పనులకు మరికొద్ది రోజుల్లో పరిపాలనా అనుమతులు జారీ చేసే అవకాశం ఉంది. ఇప్పటి వరకు మొత్తం రూ.31 వేల కోట్ల పనులకు పరిపాలనా ఆమోదం లభించింది. ఇప్పటికే అమరావతిలో రూ.20 వేల కోట్ల పైచిలుకు వ్యయంతో కూడిన పనులకు పరిపాలనా ఆమోదం లభించింది. ఈ మేరకు సీఆర్‌డీఏ కూడా టెండర్ల ప్రక్రియను చేపట్టింది. ఇప్పటి వరకు రూ.10 వేల కోట్ల మేర పనులకు సీఆర్‌డీఏ, ఏడీసీలు టెండర్లు పిలిచాయి. దీంతో సంక్రాంతి తర్వాత అమరావతిలో నిర్మాణ పనులు జరగటానికి ఆస్కారం ఏర్పడింది. అమరావతిలో కీలకమైన ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులను రెండేళ్లలో పూర్తి చేసేలా నిర్దేశిస్తూ టెండర్లను పిలిచారు. మిగిలిన అన్ని పనులనూ మూడేళ్లలో పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ, ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ)ల నుంచి తీసుకున్న అప్పులతో రాజధాని పనులను పరిగెత్తించేందుకు సీఆర్‌డీఏ టెండర్లు పిలుస్తోంది. సంక్రాంతి నాటికి రాజధానిలో రూ.43 వేల కోట్ల మేర పరిపాలనా ఆమోదాలు పూర్తి చేసుకుని మార్చిలో పనులు పురోగతిలోకి వచ్చే అవకాశం ఉంది.

ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఏఐవైఎఫ్ నాయకులు

గుంటూరు(తూర్పు), జనవరి 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలతో నిరుద్యోగ సమస్య నానాటికి పెరిగిపోతుందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అన్నారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్లో బుధవారం 21వ ఏఐవైఎఫ్ జిల్లా మహాసభ జరిగింది. సభకు సీపీఐ నాయకులు జంగాల చైతన్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని అన్నారు. ముఖ్యంగా బీజేపీ ప్రభుత్వం యువతను భావోద్వేగాలతో రెచ్చగొట్టి అ శాంతి పరిస్థితులను సృష్టించడం తప్ప, దేశంలోని యువతకు కావాల్సిన ఏ ఒక్క ప్రయోజనకర విధానాలను తీసుకురాలేదని విమర్శించారు. రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహణలో కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో పరిశ్రమలు, ప్రాజెక్టులు ఏర్పాటు చేయలేదని, దీంతో నిరుద్యోగం పెరిగిపోతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ముఖ్యంగా వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కొత్తపేట బోస్ సెంటర్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు బందేల నాసర్ జీ, షేక్ సుభాని, మహంకాళి సుబ్బారావు, షేక్ గని, జాన్సన్ బాబు, కోటా మాల్యాద్రి, మేడా హనుమంతురావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్లను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ జె.వెంకటమురళి



పర్యాటకశాఖాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జనవరి 08 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చారిత్రక సంపదను భద్రం చేస్తూ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ వెంకటమురళి కోరారు. బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో బుధవారం పర్యాటకశాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కాకతీయలాంటి దేవాలయాలు, చోళుల నాటి దేవస్థానాలు వారసత్వ సంపదగా బాపట్ల జిల్లాలో ఉన్నాయని, వాటిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. చినగంజాం మండలంలో కాకతీయుల నాటి మోటుపల్లిబీచ్ వద్దనే వీరభద్ర స్వామి ఆలయం, ఆనాటి అభయ శాసనం ఆలయం ఉందని వివరించారు. 2వేల సంవత్సరాలు క్రితం నాటి బుద్ధ స్థూపం భట్టిప్రోలు మండలంలో ఉందన్నారు. వేటపాలెం మండలంలో సుమారు 200 సంవత్సరాలు నాటి సారస్వత గ్రంధాలయం ఉందన్నారు. మహాత్మాగాంధీ ఇక్కడకు వచ్చి పరిశీలించినట్లు వివరించారు. బాపట్ల పట్టణంలో వెయ్యి ఏళ్ళ క్రితం చోళులు నిర్మించిన శ్రీ మత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయం ప్రాచుర్యంలో ఉందన్నారు. కర్లపాలెం మండలం పేరలి గ్రామంలో పర్యాటకులు బోట్లతో షికారు చేయటానికి సౌలభ్యంగా ఉందన్నారు. పర్యాటకశాఖ ద్వారా నిధులు కేటాయించి వీటిని అభివృద్ధి చేస్తే బాపట్ల జిల్లా పర్యాటక ప్రాంతంగా మారనుందని తెలిపారు. సూర్యలంక మండల బీచ్‌ని అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. దుస్తులు మార్చుకోవటానికి, మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి సౌకర్యం కల్పిస్తే మరింత ప్రయోజనం ఉంటుందన్నారు. బీచ్‌లో హెచ్‌పివి పైపు ఏర్పాటుతో పర్యాటకులు సురక్షితంగా సముద్రంలోకి మునగటానికి వీలుగా ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు పంపాలన్నారు. సమావేశంలో పర్యాటకశాఖ ఆపరేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మావతి, శివపరం పాల్గొన్నారు.

రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలి

- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



పొన్నూరుటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ జిల్లా అధికారులను కోరినట్లు బుధవారం తెలిపారు. ఇటీవల జాయింట్ కలెక్టర్ ఎ. భార్గవ్ తేజను కలిసి ధాన్యం కొనుగోళ్లపై చర్చించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రైతులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారుల ముందు ఉంచినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోళ్లను పొన్నూరు నియోజకవర్గంలో నిలిపివేసినట్లు చెప్పారు. ధాన్యంకు సంబంధించి పేమెంట్లు ప్రభుత్వం తక్షణమే చెల్లిస్తుందని కానీ ధాన్యం కొనుగోలు నిలిపివేయడం వలన రైతుల వద్ద అధిక సంఖ్యలో ధాన్యం నిల్వలు ఉన్నట్లు చెప్పారు. రైతులు తమ ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను సంప్రదిస్తే అలాట్మెంట్ లేదని అధికారులు చెప్పటం సరికాదన్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని రైతుల పండించిన ధాన్యం వివరాలను సేకరించి మొత్తం ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చేబ్రోలు, పొన్నూరు మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జాయింట్ కలెక్టర్ భార్గవతేజ ధాన్యం కొనుగోళ్లు మొత్తం చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యం కొనుగోలు చేసేలా ప్రభుత్వంతో సంప్రదించనున్నట్లు తెలియజేశారు.

10, 11, 12న నరెడ్కో మెగా ప్రాపర్టీషో-2025



ప్రాపర్టీ షో వివరాలు వెల్లడిస్తున్న నాయకుడు తిరుపతిరావు తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నరెడ్కో కాపిటల్ జోన్, గుంటూరు 12వ మెగా ప్రాపర్టీషో ఈ నెల 10, 11, 12 తేదీల్లో చేబ్రోలు హనుమయ్య ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ గద్దె తిరుపతిరావు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రాముఖ్యత, ఆకర్షణను పెంచుతుందనీ, ప్రాపర్టీషోకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్నట్లు వివరించారు. ప్రాపర్టీ షో కార్యక్రమంలో మంత్రి నారాయణ, లోకల్ ఎమ్మెల్యేలు, తదితర ప్రముఖులు కూడా పాల్గొంటారని తెలిపారు. జనవరి 12న ముగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. నారెడ్కో చైర్మన్ హీరానందని, నేషనల్ ప్రెసిడెంట్ గడ్డిపాటి హరిబాబు, స్టేట్ ప్రెసిడెంట్ చక్రధర్, మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాపర్టీషోలో 150 స్టాల్స్ ఏర్పాటు చేశామని, వీటిలో బిల్డర్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, జాతీయ బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, బిల్డింగ్ మెటీరియల్ సప్లయర్స్ పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మామిడి సీతారామయ్య, క్యాపిటల్ జోన్ ప్రెసిడెంట్ నాగవంశీ, సెక్రెటరీ శ్రీనాథ్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ కుమార్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గుంటూరు కళాపరిషత్ నాటక సంబరాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆలోకం పెద్దబ్బయ్య, నాయుడు గోపి

గుంటూరు(తూర్పు), జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదికగా ఈ నెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు గుంటూరు కళా పరిషత్ వార్షిక నాటక సంబరాలు నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ గౌరవ సలహాదారుడు ఆలోకం పెద్దబ్బయ్య, ఉపాధ్యక్షుడు నాయుడు గోపి తెలిపారు. విజ్ఞాన మందిరం ఆవరణలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో నాటికలకు సంబంధించిన ఆహ్వానపత్రికలను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. 10న సిటీ వాకర్స్ అసోసియేషన్ గుంటూరు వారిచే 'స్వేచ్ఛ', శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరి వారిచే 'జనరల్ బోగీలు', కళానికేతన్ వీరన్నపాలెం వారిచే 'ఋతువులేని కాలం', 11న గంగోత్రి, పెదకాకాని వారిచే 'అష్టమ వసువు', 12న మిత్ర క్రియేషన్స్ హైదరా బాదు వారిచే 'మట్టిమనిషి' సాంఘిక నాటికలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ప్రదర్శనలతోపాటు ప్రతిరోజూ సభా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాలు 10, 11 తేదీల్లో సాయంత్రం 6.30 గంటలకు, 12న ఉదయం 10 గంటలకు సి.నాగభూషణం నటప్రస్థానం సదస్సు జరుగుతుందని చెప్పారు. నాటకాలను తిలకించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పరిషత్ సభ్యులు పి.మల్లికార్జునరావు, బి.పూర్ణ, గుమ్మడి నాగేశ్వరరావు, షేక్ సైదా, ఆవుల సుబ్బారావు, రావుల అంజి బాబు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

దాచేపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని దారం ఆదిలక్ష్మి (29) అనే వివాహిత ఇంట్లో సరుకులు తెచ్చుకునేందుకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం దాచేపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దాచేపల్లిలోని చేపలగడ్డకు చెందిన దారం నరేష్ భార్య ఆదిలక్ష్మి ఇంట్లోకి సరుకులు తెచ్చుకునేందుకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె 5.2 అడుగుల ఎత్తు ఉండి, నలుపురంగులో ఉంటుందని వివరించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119,127,137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 566.60 అడుగులు ఉంది. ఇది 248.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8022 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 20,222 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 43,444 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

70,663 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 68,127 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 70,663 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 52,849 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7200	14000	334	7500	13500
నంబరు. 5	8500	11000	నంబరు. 5	8000	11500
273	7500	9000	273	--	--
341	8500	15800	341	9000	14000
4884	8000	12500	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7800	16500	తేజ	8000	16000
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	9500	11500
దేవనూరుడీలక్స్	9500	14500	దేవనూరుడీలక్స్	13000	13000
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4000	9500

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కడియం బాలయ్య (ఫైల్‌ఫొటో)

ఈపూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని దుస్మాన్‌పేట తండా వద్ద బుధవారం జరిగింది. బొల్లాపల్లి మండలం మూగచింతలపాలెం గ్రామానికి చెందిన కడియం బాలయ్య(45) పొలంలో చేసిన పనులకు సంబంధించి కూలి డబ్బుల కోసం దుస్మాన్‌పేట తండాకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. బాలయ్య ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వినుకొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీకొంది. ప్రమాదంలో బాలయ్య రోడ్డుపైన పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల్లో 169 మంది ఎంపిక

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షల్లో బుధవారం 169 మంది అభ్యర్థులు తదుపరి పరీక్షలకు ఎంపికయ్యారు. మొత్తం 305 మంది హాజరు కాగా 74 మంది సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. ఒకరు పరుగుపందెంలో పాల్గొనలేదు. మిగిలిన 206 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు నిర్వహించగా వారిలో 24మంది ఛాతి, ఎత్తు తదితర కొలతలు సరిపోకపోవడంతో వల్ల తిరస్కరింపబడ్డారు. మిగిలిన 242 మందికి 1600 మీటర్ల పరుగుపందెం నిర్వహించగా 27మంది విఫలమయ్యారు. 179 మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా వారిలో 100మంది అర్హత సాధించారు. కాగా 179మందికి లాంగ్‌జంప్ నిర్వహించగా వారిలో 169మంది అర్హత సాధించగా 11మంది విఫలమయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సుప్రజ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఉపకులపతి ఎంపికకు సెర్చ్ కమిటీ నియామకం

గుంటూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) ఉపకులపతిని ఎంపిక చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సెర్చ్ కమిటీని నియమించింది. మొత్తం ముగ్గురి పేర్లను సూచించాల్సిందిగా ఆదేశించింది. సెర్చ్ కమిటీలో డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పూర్వ వీసీ డాక్టర్ సీవీ రావు, గీతమ్ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కే శివరామకృష్ణ, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి ఆచార్య సంజీవ్ జైన్‌ని నియమించింది. ఈ త్రిసభ్య కమిటీ అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకొని ఈ ముగ్గురి పేర్లను సిఫార్సు చేస్తుంది. ఆ ముగ్గురిలో ఒకరిని వీసీగా ఎంపిక చేస్తారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ సెక్రెటరీ కోన శశిధర్ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులను భర్తీ చేయాలి

● అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సుబ్బరావమ్మ

గుంటూరు (తూర్పు) జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న అంగ న్వాడీ పోస్టు లను భర్తీ చేయా లని, సమ్మె కాలపు ఒప్పం దాలను అమలు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. సమ స్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట జరుగుతున్న దీక్షలు బుధవారం నాటికి మూడో రోజుకు చేరాయి. ఈ దీక్షలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ జిల్లాలో 39 వర్కర్స్, 66 హెల్పర్ల మొత్తం 105 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గత ఏడాది కాలంగా ఐసీడీఎస్ అధికారులకు, కలెక్టరుకు అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికి సమస్య పరిష్కరించకపోవడం వల్లే ఆందోళనకు దిగాల్సి వచ్చిందని అన్నారు. జిల్లా మినహా మిగతా రాష్ట్ర మంతటా ఖాళీ పోస్టులను గుర్తించి నోటిఫికేషన్ విడుదల చేసి నియామకాలు చేపట్టినప్పటికీ మన జిల్లాలో ఈ ప్రక్రియ చేపట్టకపోవడానికి కారణాలేంటని ప్రశ్నించారు. జిల్లాలో అనేకచోట్ల అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకి ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో కలసి కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. పలు సంఘాల నాయకులు దండా లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ, బి శ్రీనివాసరావు, అంగన్‌వాడీలు దీప్తి మనోజ, వెంకాయమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసనల్లో పాల్గొన్న అంగన్‌వాడీలు

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ధనుర్మాస పూజలు

పిడుగురాళ్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిర్డీసాయి మందిరంలో ధనుర్మాస పూజల్లో భాగంగా గత 24 రోజులుగా విశేష పూజలు జరుగుతున్నాయి. బుధవారం కూడా పట్టణంలోని భక్తులు ధనుర్మాస పూజలో వేకువజామున పాల్గొన్నారు. దేవాలయ అర్చకుడు వల్లూరి వాసుదేవ శర్మ, కారంపూడి కృష్ణకిషోర్‌లు ధనుర్మాస పూజలను నిర్వహిస్తున్నారు.

నాగిరెడ్డిపాలెం సర్పంచి చెక్ పవర్ రద్దు

బెల్లంకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం సర్పంచి చెక్ పవర్ రద్దయినట్టు జిల్లా డీపీవో నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం గ్రామంలో రూ .1,83,245 నిధులు దుర్వినియోగం అయినట్టు, అంతే కాకుండా పారిశుధ్య కార్మికులకు గత ఆరు నెలల నుంచి జీత భత్యాలు ఇవ్వనందుకు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో చెక్ పవర్ రద్దు చేసినట్టు తెలిసింది. నాగిరెడ్డిపాలెం పంచాయతీ అధికారాన్ని ఈవోపీఆర్‌డీ, పంచాయతీ సెక్రటరీలకు నిధులు అప్పగించినట్టు ఎంపీడీవో హనిమిరెడ్డి పేర్కొన్నారు. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు నిధులు దుర్వినియోగం అయ్యాయని జిల్లా అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయటంతో విచారణ జరిపి నాగిరెడ్డిపాలెం పంచాయతీ చెక్ పవర్‌ను రద్దు చేసినట్టు డీపీవో ఉత్తర్వులు అందాయి.

12న దుర్గిలో డ్యాన్స్ బేబి డ్యాన్స్

దుర్గి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గిలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల, నూతన సంవత్సరం, సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యాన తెలుగు రాష్ట్రాల స్థాయి డ్యాన్స్ బేబి డ్యాన్స్ పోటీలు ఈ నెల 12న నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఈ పోటీలు నిర్వహించనున్నట్లు ఫ్రెండ్స్ యూత్ సభ్యులు తెలిపారు. వివరాలకు 7989321191ను సంప్రదించాలన్నారు.

రేపు ఉత్తరద్వార దర్శనంకు ఏర్పాట్లు

దాచేపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మార్గశిరమాసం వైకుంఠ ఏకాదశిలో ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు దేవాలయాల్లో పూర్తి చేశారు. అత్యంత ప్రాచీనమైన కృష్ణానది పరివాహక ప్రాంతమైన మట్టపల్లి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో ఉత్తరద్వార దర్శనానికి శుక్రవారం ఉదయం 5:30 గంటలకు రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి వారి వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం భక్తులకు కల్పిస్తారు. గరుడ వాహనంపై స్వామి వారిని మాడ వీధుల్లో ఊరేగిస్తారు. దాచేపల్లిలో 500 సంవత్సరాల క్రితం నుంచి భక్తుల సేవలు అందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు గావించారు. వేకువజాము నుంచే స్వామి వారికి పంచామృతాభిషేకాలతో సేవా కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు

మాచర్ల రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏపీవో తోట నాగశ్రీనివాస్ ఆధ్వర్యాన నియోజకవర్గ పరిధిలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. రైతుల పొలాల్లో నీటి కుంటలు, ఫారంపాండ్స్, అమృత సరోవర్ చెరువుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఏవోపీ నాగశ్రీనివాస్ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కూలీలకు కనీస వేతనం రూ. 300 ఉండేలా మార్కింగ్ ఇవ్వడంపై పలు సూచనలు చేశారు. రిసోర్స్ పర్సన్స్ గోవిందరాజు, రాఘవ, ఈసీ రవీంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

సత్తెనపల్లి రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో 2023-24 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. ఉపాధి హామీ పథకం కూలీలు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు ప్రజా వేదికలో పాల్గొనాలని ఆయన కోరారు.

మండెపూడి ఆరోగ్య ఉపకేంద్రంలో తనిఖీ

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి) పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె రవీంద్ర రత్నాకర్ బుధవారం మండల పరిధిలోని మండెపూడి గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. వైద్యసిబ్బందికి కీటక జనితమైన వ్యాధులపై అవగాహన కల్పించారు. సబ్‌యూనిట్ అధికారి ఎస్‌కె సుబాన్, ఆరోగ్య విస్తరణాధికారి కె.లక్ష్మీ మనోహర్, ఆరోగ్య కార్యకర్తలు కోటేశ్వరరావు, ధనమ్మ, ఆషా కార్యకర్తలు భువనేశ్వరి, అనిత పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బెల్లంకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 10వ తేదీన బెల్లంకొండ మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో హనిమిరెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మ వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరుగుతుందని, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

మాచర్ల రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మండలంలోని విజయపురిసౌత్‌లో బుధవారం చోటుచేసుకుంది. విజయపురిసౌత్ గ్రామానికి చెందిన బత్తుల సురేష్ బుధవారం తన భార్య కల్పన (28) ఉరి వేసుకుందంటూ ఆమెను విజయపురిసౌత్ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై వైద్య సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సురేష్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ముప్పాళ్ళ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బత్తినేని గంగాధరరావు పేరుతో ఆయన కుమారుడు భాను ప్రసాదు, అతని స్నేహితులు సేవా కార్యక్రమాలు చేయటం అభినందనీయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని రుద్రవరంకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గంగాధర్ నాలుగేళ్ల క్రితం మృతి చెందారు. ఆయన పేరుతో భాను ప్రసాదు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం గంగాధర్ వర్ధంతి సందర్భంగా పరివర్తన ఆశ్రమ పాఠశాలలో 30 మంది విద్యార్థులకు కిట్లను ఎమ్మెల్యే కన్నా చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆస్తుల కోసం తల్లిదండ్రులను కన్నబిడ్డలు సరిగా చూడని ప్రస్తుత రోజుల్లో గంగాధరరావు భౌతికంగా లేకపోయినప్పటికీ ఆయన కుమారుడు భాను ప్రసాదు సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆదర్శనీయమన్నారు. భాను ప్రసాదు తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకోవటం స్ఫూర్తి దాయకమన్నారు. అనంతరం శాశ్వత సభ్యత్వ గుర్తింపు కార్డును కన్నా భాను ప్రసాదుకు అందజేశారు. ముందుగా గంగాధరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎలినేడి రామ స్వామి, పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, ఇరుగుపాలెం సర్పంచి, మాజీ సర్పంచి దరువూరి శ్రీనివాసరావు, రావిపాటి మధుబాబు, మాజీ ఉప ఎంపీపీ రావిపాటి నానయ్య, తెల్లజర్ల వెంకటేశ్వర్లు, షేక్ మౌలాలి, మాబూ సుభాని తదితరులు పాల్గొన్నారు.



భాను ప్రసాదుకు టీడీపీ శాశ్వత సభ్యత్వ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

వడ్డెర సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

సత్తెనపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వడ్డెర కులస్తులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. వడ్డెర షార్ప్ థింకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరులోని తన కార్యాలయంలో అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు బత్తుల వెంకటస్వామి ఆధ్వర్యంలో వడ్డెర సంఘం క్యాలెండర్‌ను కన్నా ఆవిష్కరించారు. వడ్డెర సంఘం నాయకులు కొమెర వీరాంజనేయులు, గుంజి విజయ కుమార్, వంటిపులి నాగేశ్వరరావు, పల్లపు ధర్మారావు, వేములకొండ బుజ్జి, మరియాల సాంబయ్య, బ్రహ్మయ్య, వంటిపులి అంకమరావు పాల్గొన్నారు.

మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

రాజుపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమోడు శివారు వీరమ్మకాలనీలో ఉన్న మసీదులో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానికంగా ఉన్న ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్‌తిమా విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక ముస్లిం మత పెద్దలు, కూటమి నేతలు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

సత్తెనపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వావిలాల ఇండోర్ స్టేడియంలో ఈనెల 11న జరగనున్న నియోజవర్గ స్థాయి షటిల్ బాడ్మింటన్ పోటీల పోస్టర్లను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం రాత్రి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోమినేటి శ్రీనివాసరావు, ఆళ్ళ సాంబయ్య, నూర్ బాషా జాన్ బాబు, తొరటి వెంకటరావు, దరువూరి నాగేశ్వరరావు, గుజ్జర్లపూడి స్టాలిని, మక్కపాటి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటి విజయానికి కూటమి నేతలు ఐక్యంగా కృషి చేయాలి

● గ్రాడ్యుయేట్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రానున్న పట్టభద్రుల ఎంఎల్‌సీ ఎన్నికల్లో కూటమి పార్టీల నేతలందరూ ఎంఎల్‌సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు విజయానికి ఐక్యంగా కృషి చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బుధవారం పిలుపు నిచ్చారు. క్రోసూరు మండలం దొడ్లేరులో జరిగిన నియోజకవర్గ పట్టభద్రుల, మేధావుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎల్‌సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు కూడా సమావేశానికి హాజరయ్యారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ టీడీపీ శ్రేణులతో పాటు బీజేపీ, జనసేన నాయకులందరూ పట్టభద్రులు, మేధావులు తమ ఓటు హక్కు వినియోగించుకొనే విధంగా కృషి చేయాలన్నారు. ఈ ఎన్నికల్లో కృషి చేసిన వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంఎల్‌సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ఫైలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకం చేశారని అన్నారు. సుమారు 17వేల ఉపాధ్యాయ పోస్టులు త్వరలో భర్తీ కానున్నాయన్నారు. కూటమి నేతలందరూ తన విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చేతుల మీదుగా లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్‌లు కాండ్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు, రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి వేగుంట రాణి, నియోజకవర్గ టీడీపీ నాయకులు పెదకూరపాడు బుజ్జి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, అర్తిమళ్ళ రమేష్, గుడిపాడు బాషా, నందిగామ ఆశీర్వాదం, యర్రంశెట్టి రామకృష్ణ, దిగుమర్తి అప్పారావు, షేక్ సలాం, మొగల్ జాన్, గంధం కోటేశ్వరరావు, కొండవీటి శ్రీనివాసరావు, దుద్దుల యోహాన్, బత్తుల హనుమంతరావు పాల్గొన్నారు.



పట్టభద్రుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

భూ సమస్యలు పరిష్కారం

పెదకూరపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని పొడపాడులో బుధవారం రెవెన్యూ గ్రామ సదస్సును గ్రామ సర్పంచి కాసర బాధ రూపలక్ష్మి హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారంతో పాటు రెవెన్యూ పరమైన సేవలను ప్రజల వద్దకు చేర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై రైతుల నుంచి వచ్చిన అర్జీలను తహసీల్దార్ మీసాల డానియేలుతో కలిసి స్వీకరించారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను విచారించిన ఈవోపీఆర్డీ

గురజాలటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపాడు సచివాలయం-1లో ఓ ఉద్యోగి నకిలీ జనన, మరణ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. బుధవారం ఈవోపీఆర్డీ జయరాంనాయక్, పంచాయతీ సెక్రటరీ సుబ్బారావు సచివాలయంకు చేరుకొని ఉద్యోగులను విచారించారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సచివాలయంలో ఉద్యోగులను విచారిస్తున్న అధికారులు

కాలువలో పూడికతీత పనులు ప్రారంభం

సత్తెనపల్లి రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కాలువ ఆయకట్టు పరిధిలోని చివరి భూములకు సాగునీరు అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కంటెపూడి సమీపంలో గల లింగంగుంట్ల మేజరు పూడిక తీత పనులను బుధవారం ఎమ్మెల్యే కన్నా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ అభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం పరిపాలన చేస్తుందన్నారు. రైతు సాగు చేసే ఆయకట్టులోని చివరి భూములకు సాగు నీరు అందించి వారి అభివృద్ధికి కృషి చేయటమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. సాగు నీటిని పొదుపుగా వాడుకొని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోమటినేని శ్రీనివాసరావు, బండారుపల్లి నరసింహారావు, మండడపు సాంబశివరావు, దరువూరి నాగేశ్వరరావు, గద్దె అప్పారావు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు నిబంధనలకు లోబడి చేయాలి

క్రోసూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ శ్రమశక్తి సంఘాల వారు నిబంధనలకు అనుగుణంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ ఎం.సిద్ద లింగమూర్తి అన్నారు. ఇటీవల కొత్తగా నియమితులైన ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుల శిక్షణ కార్యక్రమం బుధవారం క్రోసూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. డ్వామా పీడీ సిద్ద లింగమూర్తి మాట్లాడుతూ క్షేత్ర సహాయకులు పనులను కొలతల ప్రకారం నిర్వహించాలని, నాణ్యమైన పనులను చేపట్టాలని , కూలీలకు కనీస వేతనం లభించేలాగా బాధ్యత తీసుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు శ్రమ శక్తి సంఘాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వచ్చే ఆరు మాసాల్లో డీఆర్‌డీఏ వారు ఇచ్చిన టార్గెట్ల ప్రకారం పనులు నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలోని అమరావతి, అచ్చంపేట, పెదకూరపాడు, క్రోసూరు మండలాలకు చెందిన కొత్తగా ఎంపికైన 44 మంది క్షేత్ర సహాయకులు శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో జీ శ్రీనివాసరావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో వెంకటేశ్వరరావు, జిల్లా రిసోర్స్ పర్సన్ వెంకటస్వామి, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

పెదకూరపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎన్‌ఆర్‌ఐ మాగులూరి భాను ప్రకాష్ అన్నారు. పెదకూరపాడు, 75 తాళ్ళూరు గ్రామాల్లోని జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో బుధవారం మోటివేషన్ క్లాసులను నిర్వహించారు. ఈ సందర్భంగా భాను ప్రకాష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి మాగులూరి ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఈ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకట రమణ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముగ్గురు రాజుల తిరునాళ్ల

పెదకూరపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో బుధవారం ముగ్గురు రాజుల తిరునాళ్ల మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో అందరూ ముందుకు వెళ్ళాలని సూచించారు. స్థానిక విచారణ గురువులు పి.రాజారెడ్డి, సహాయక గురువులు ఏ బాల ధీరజ్ తదితరులు పాల్గొన్నారు. . ఈ తిరునాళ్ళ మహోత్సవాన్ని పురస్కరించుకొని క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన విచారణ గురువులు, మఠ కన్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని, ముఖ ద్వారాన్ని, మరియ మాత, బాల ఏసు ప్రతి రూపాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

జడ్పీహెచ్‌ఎస్‌లో పుస్తక ప్రదర్శన

మాచర్ల రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పునూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం హెచ్‌ఎం ఐవి నాగమణి ఆధ్వర్యాన గ్రంథాలయాల పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. హెచ్‌ఎం నాగమణి మాట్లాడుతూ సంక్రాంతి సెలవుల్లో పుస్తక పఠనం చేయాలన్నారు.

1400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

వెల్దుర్తి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట, మాచర్ల ఎక్సైజ్ అధికారులు బుధవారం మండలంలోని గుండ్లపాడులో దాడులు జరిపారు. ఈ దాడుల్లో 65 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేసినా, తెలంగాణ మద్యం విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. దాడుల్లో మాచర్ల ఎక్సైజ్ సీఐ వెంకటరమణ పాల్గొన్నారు.



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

మిగిలిన ఆహారాన్ని వృథా చేయవద్దు

పెదకూరపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మిగిలిన ఆహారాన్ని వృథా చేయవద్దని జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్ళూరి సాంబశివరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో బాలినేని రామయ్య గృహం వద్ద జరిగిన ఫంక్షన్‌లో మిగిలిన ఆహారాన్ని మంగళవారం రాత్రి జన చైతన్య ప్రతినిధులు దేవాలయం వద్ద వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుడిపూడి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 213 అర్జీలు

అచ్చంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సు ద్వారా 213 దరఖాస్తులు వచ్చాయని మండల తహసీల్దార్ కె.శ్రీనివాస్ తెలిపారు. మండలంలో 108 దరఖాస్తులను పరిష్కరించామని, మరో 85 దరఖాస్తులు త్వరలో పరిష్కరిస్తాని తెలియ జేశారు. మొత్తం 60.09 శాతం పరిష్కరించామని ఆయన అన్నారు.

పింఛన్‌ల తనిఖీ

బెల్లంకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌ల తనిఖీలో భాగంగా బుధవారం బెల్లంకొండ మండలంలో త్రిసభ్య కమిటీ మెంబర్లు తనిఖీలు చేపట్టారు. మండలంలో మొత్తం హెల్త్, వికలాంగుల పింఛన్‌లు 18 ఉన్నాయని, అందులో రూ. 10వేల నుంచి రూ.15 వేలు ప్రతి నెలా అందుకుంటున్నారని, దీనిలో భాగంగా విచారణ చేపట్టారు. మన్నె సుల్తాన్‌పాలెం ఐదు, పాపాయపాలెం ఒకటి, చంద్రాజుపాలెం ఒకటి, ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ రెండు, నాగిరెడ్డిపాలెం రెండు, బెల్లంకొండ ఏడు పింఛన్‌లను తనిఖీ చేపట్టారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ముగ్గురు అధికారులు బెల్లంకొండ మండలంలో 18 మంది పింఛన్ దారులను తనిఖీలతో పాటు విచారణ చేపట్టారు.

దాచేపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ, గ్రామీణ మండలంలో ఆరోగ్య పెన్షన్లు (బెడ్‌రెస్ట్) తీసుకునే వారికోసం వైద్య బృందం బుధవారం పర్యటించారు. దాచేపల్లి నగర పంచాయతీలో 21 పెన్షన్లు, గ్రామీణ మండలాల్లో మరో 40 మంది లబ్ధిదారులను అధికారులు క్షేత్రస్థాయిలో విచారించారు.

వైసీపీ ఇన్‌చార్జ్‌గా డాక్టర్ గజ్జల

సత్తెనపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి నియోజక వర్గ వైసీపీ ఇన్‌చార్జ్‌గా నరసరావుపేటకు చెందిన డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డిని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్‌గా నియమించిందని ఆ పార్టీ వర్గాలు బుధవారం తెలిపాయి.

రైస్‌మిల్లుల్లో తనిఖీ

గురజాలటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గంగవరం రోడ్డులో ని సప్తగిరి రైస్‌మిల్లును బుధవారం ఎంపీడీవో గౌసియాబేగం తనిఖీ చేశారు. స్టాక్‌ను, బియ్యం నాణ్యతను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 38.61 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

వెల్దుర్తి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని మండల పరిషత్ అధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాలరావు అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. అడిగిన ప్రతి ఒక్కరికీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పించాలని సూచించారు. ఉపాధి పనులు చేసుకునేందుకు అటవీ శాఖాధికారులు కూడా సహకరించాలన్నారు. ఈ సందర్భంగా పలు శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ప్రసాద్, డాక్టర్ శ్రీరాం, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంజీవరెడ్డి

ఎస్టీయూ స్టడీ మెటీరియల్ అందజేత

మాచర్లటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల, సెయింట్ గరల్స్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ఎస్టీయూ నేతలు స్టడీ మెటీరియల్ అందించారు. శ్రీతులసీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సహకారంతో వీటిని అందిస్తున్నట్లు నేతలు తెలిపారు. విద్యార్థులు ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. తులసీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె గంగాధరబాబు, కృష్ణానాయక్, ఎక్స్‌మాస్ జాన్, డేవిడ్ విల్సన్, గోవిందరావు, భాస్కరబాబు, కెనడి, హెచ్‌ఎంలు రామారావు, తామసమ్మ, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

దుర్గి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ఎస్టీయూ నేతలు స్టడీ మెటీరియల్ అందించారు. శ్రీతులసీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సహకారంతో వీటిని అందిస్తున్నట్లు నేతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 బెంజిమెన్, తులసీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె గంగాధరబాబు, జీసీహెచ్ అనంతరామయ్య, నబీసాహెబ్, ఎర్రం ఏడుకొండలు, హనుమంతురావు, హెచ్‌ఎం కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

దాచేపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామానికి చెందిన బట్టు పరమేశ్వరరావు (60) డిసెంబరు 15 నుంచి కనిపించకుండా పోయినట్లు అతని కుమారుడు సువర్ణకుమార్ దాచేపల్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పరమేశ్వరరావు సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికునిగా పని చేసి రిటైర్డ్ అయ్యారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నూతనంగా నిర్మిస్తున్న ఇంట్లో నిద్రించడానికి వెళ్లిన వ్యక్తి 16వ తేదీ ఉదయం 9 గంటల వరకు ఇంటికి రాకపోయే సరికి కుటుంబసభ్యులు, బంధువులను విచారించగా ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పీఎం సూర్యఘర్ పథకానికి 14,550 పేర్ల నమోదు

రెంటచింతల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచి సామాన్యులపై విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో ఇప్పటి వరకు 11 మండలాల్లోని ఎస్సీఎస్టీ వర్గాలకు చెందిన 14,550 మంది పథకానికి అర్హులుగా భావించి రిజిస్ట్రేషన్ చేసినట్లు విద్యుత్ ఈఈ ఎస్ సింగయ్య చెప్పారు. బుధవారం రెంటచింతలలో విలేకరులతో మాట్లాడుతూ మొత్తం ఎస్సీ ఎస్టీలకు సంబంధించి విద్యుత్ గృహాలు 30,781 దాకా ఉన్నాయన్నారు. ఈనెల 15 కల్లా పూర్తి స్థాయిలో రిజిస్ట్రేషన్ చేస్తామన్న చెప్పారు.

త్రిసభ్య కమిటీలకే మొగ్గు

రెంటచింతల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార (పీఏసీఎస్) సంఘాల పాలక వర్గాలకు ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం లేదు. ఆరు నెలల పాటు త్రిసభ్య కమిటీలను ప్రభుత్వం నియమించింది. పీఏసీఎస్‌లకు చివరి సారిగా 2013 జనవరి 24న ఎన్నికలు జరిగాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటి స్థానంలో త్రీమెన్ కమిటీలను వేసింది. అప్పటి నుంచి త్రిసభ్య కమిటీతోనే నెట్టుకొస్తున్నారు. మండలంలో మూడు సొసైటీలున్నాయి. మంగళవారం రెంటచింతలకొచ్చిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో నేతలు సమావేశమై రెంటచింతల, మంచికల్లు గ్రామాలకు సంబంధించి అధ్యక్షుల పేర్లు ఖరారు చేశారు. ఒక్క పాలువాయి సొసైటీ మాత్రమే పెండింగ్‌లో ఉంది. పాలువాయి సొసైటీకీ సంబంధించి అల్లం బ్రహ్మారెడ్డి, లింగయ్యలు పదవిని ఆశిస్తున్నారు. గురువారం ఉదయం కల్లా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అధ్యక్ష అభ్యర్థి పేరును ఖరారు చేయనున్నట్లు సమాచారం.

కోడి పందేలు వేస్తే కఠిన చర్యలు

నకరికల్లు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కోడి పందేలు వేసినా, పేకాట ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ హెచ్చరించారు. గతంలో కోడి పందేలు నిర్వహించిన వారిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ కె.పుల్లారావు ఎదుట హాజరు పరిచి కొందరికి రూ.2 లక్షలు, మరి కొందరికి రూ.3 లక్షల వరకు బైండోవర్ చేయించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి పై కేసులు నమోదు చేయటంతో పాటు సంబంధిత మొత్తాలను వారి నుంచి వసూలు చేసి ప్రభుత్వానికి జమ చేస్తామన్నారు. అంతేగాక రౌడీషీట్లను తెరుస్తామని ఎస్ఐ స్పష్టం చేశారు.

పండగల్లో జూదాలొద్దు

రెంటచింతల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పండగలు ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని, కోడిపందేలు, పొట్టేళ్ల పందేలు, అశ్లీల నృత్యాలు, జూదం నిర్వహించరాదని ఎస్ఐ సీహెచ్ నాగార్జున కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండుగలకు ఇతర ప్రాంతాలకు వెళితే సమాచారం ఇవ్వాలన్నారు. ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. మంగళవారం కోడిపందేల నిర్వహణపై దాడి చేసి పట్టుకున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.300 అందించాలి

రాజుపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం కింద కూలీకి వేతనం రోజుకు రూ. 300 అందేలా చూడాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ద లింగమూర్తి సూచించారు. బుధవారం మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామంలో ఉన్న మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పథక సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా గ్రామాలలో ఫారమ్ పౌండ్స్, అమృత సరోవర్ ట్యాంక్‌లు, చెరువులలో పూడికతీత వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వలన్నారు. ఏపీడీ పీవీ నారాయణ, ఎంపీడీవో జీవీ సత్యానారాయణ, డీఆర్పీలు ఉన్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేపట్టిన కూటమి నేతలు

మాచర్ల రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో బుధవారం జంగిల్ క్లియరెన్స్ పనులను కూటమి నేతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు, టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు, తెలుగు యువత జిల్లా కార్యదర్శి సైదారావు, జనసేన మండల అధ్యక్షుడు సాంబశివరావు, రాహుల్, ఆడెపు కోటయ్య, సత్తిబాబు, చరణ్, గంటా ధనుంజయరావు, కట్టా రాజు, ఊరే మార్కు తదితరులు పాల్గొన్నారు.

కిడ్స్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

మాచర్లటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కిడ్స్ పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. సంక్రాంతి పండగ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. బొమ్మలకొలువు, ముగ్గుల పోటీలు జరిపారు. కేసీపీ జనరల్ మేనేజర్ వెంకటరమణ, శ్రీనివాస్, హెచ్‌ఎం ఆర్‌కే శాస్త్రి, విజయ్‌శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీతిక సీబీఎస్ఈ స్కూల్‌లో స్పోర్ట్స్ మీట్

పిడుగురాళ్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ ఆధ్వర్యాన మండలంలోని బ్రాహ్మణపల్లి సమీపంలోని గీతిక సీబీఎస్ఈ స్కూల్‌లో రెండు రోజులుగా రోటరీ ఇంట్రాక్ట్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం వడ్లమాని రాజ్యలక్ష్మి విద్యార్థులకు ఆటల పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

గ్రామాల్లో సంక్రాంతి శోభ

- పిండి వంటల ఘుమఘుమలు
- అరిసెలు, లడ్డూ తయారీలో మహిళలు
- హరిదాసుల సందడి
- గ్రామాలకు చేరుకుంటున్న బంధువులు



సంక్రాంతికి సిద్ధమైన అరిసెలు, లడ్డుల, పూస మిఠాయి

గ్రామాల్లో సంచరిస్తున్న హరిదాసు



వట్టిచెరుకూరులో సంక్రాంతికి అరిసెలు వండుతున్న గృహిణులు





వట్టిచెరుకూరులో చెక్కలు తయారు చేస్తున్న మహిళలు



వట్టిచెరుకూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం సమీపిస్తున్న నేపథ్యంలో పిండి వంటల తయారీపై గృహిణులు దృష్టి సారించారు. పిండి వంటల ఘుమ ఘుమల గుబాళింపు ప్రతి ఇంట ప్రారం భమయ్యాయి. సంక్రాంతికి సంప్రదాయ బద్ధంగా కొత్తగా పెళ్ళయిన అల్లుళ్ళు, కూ తుళ్ళు, సుదూర ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నవారు సంక్రాంతికి సొంత గ్రామాలకు చేరుకుంటారు. పిండి వంటల కోసం రెండు మూడు కుటుంబాలకు చెందిన మహిళలు ఒక చోట చేరి ఆయా కుటుంబాలకు అవసరమైన అరిసెలు, లడ్లు, పప్పు చెక్క, బూందీ, కారప్పూస, చెక్కలు వంటి వంటకాలు చేసుకుంటారు. సంక్రాంతి వస్తుందంటేనే ధనుర్మాసం ప్రారంభం నుంచి వంశపారంపర్యంగా వచ్చే హరిదాసులు సంప్రదాయ దుస్తులు ధరించి తలపై కలశం, తుంబురతో మరోచేతిలో భజన చెక్కలను మీటుకుంటూ గ్రామ సంచారం సాగిస్తుంటారు. ఇప్పటికే సంక్రాంతిని పురస్కరిం చుకొని కొన్ని గ్రామా లకు సుదూర ప్రాం తాల్లో నివసించే కూతు ళ్ళు, అల్లుళ్ళు, కుమారులు, కోడళ్ళు, మనువళ్ళు, మనుమ రాళ్ళు గ్రామాలకు చేరుకుంటున్నారు.

హ్యూమన్ మెటా న్యూరో వైరస్ పట్ల ఆందోళన వద్దు

- ఇది ఫ్లూ తరహా తరుణ వ్యాధే
- డీఎంహెచ్‌వో విజయలక్ష్మి వెల్లడి



డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి

గుంటూరు మెడికల్, జనవరి 7 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో హ్యూమన్ మెటా న్యూరో వైరస్ (హెచ్ఎంపీవీ) గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది సీజనల్ ఫ్లూ తరహా తరుణ వ్యాధని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి వెల్లడించారు. ఈ మేరకు బుధ వారం హెచ్ఎంపీ వైరస్‌పై ప్రజావ గాహన కోసం పత్రిక ప్రకటన విడు దల చేశారు. హ్యూమన్ మెటా న్యూరో వైరస్ సాధారణంగా ఐదేళ్ల లోపు పిల్లలకు, 60 ఏళ్లు పైబడ్డ వృద్దులకు, వ్యాధి నిరోధక శక్తి తక్కు వగా ఉన్న వారికి, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సోకే అవకాశం ఉంటుందన్నారు. దీనికి విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని, ప్రత్యేక చికిత్సలు అంతగా అవసరం ఉండదని తెలి పారు. ఈ వైరస్‌ను 24 ఏళ్ల కిందటే గుర్తించా రని, ఇది కొత్త వైరస్ కాదని ఆమె స్పష్టం చేశారు. వైరస్ ద్వారా సంక్రమించే వ్యాధులకు యాంటీ బయోటిక్ మందులు పని చేయవని, జలుబు, దగ్గుతో బాధపడే వారు ఈ మందులు వాడవద్దని ఆమె సూచించారు. చిన్నపాటి జాగ్రత్తలు పాటించడం వల్ల హ్యూమన్ మెటా న్యూరో వైరస్ బారిన పడ కుండా రక్షణ పొందవచ్చని ఆమె తెలిపారు. తరచూ చేతులను సబ్బుతో శుభ్రపర్చుకోవడం, రద్దీ ప్రాంతాల్లో సంచరించే సమ యంలో మాస్కులు . ధరించాలని తెలిపారు. మంచినీరు ఎక్కువగా తీసుకోవడం, తాజా పౌష్టికాహారం తీసుకో వడం, దగ్గు, జలుబు ఉన్న వారికి దూరంగా ఉండాలని డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ముక్కును, కళ్లను చేతులతో తాకవద్దని, ఇత రులతో కరచాలన చేయవద్దని వివరించారు. దగ్గు, జ్వరంతో బాధపడే పిల్లలను పాఠశాలకు పంపకుండా ఇంటిలో ఉంచి విశ్రాంతి ఇవ్వా లని తెలిపారు. పిల్లలకు సకాలంలో ప్రభుత్వం ఇచ్చే అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ లక్ష్మీ కోరారు.

రేపు నృసింహుని.. ఉత్తర ద్వార దర్శనం

- బంగారు దక్షిణావృత శంఖుతో భక్తులకు తీర్థం
- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ సతీశ్‌కుమార్

వైకుంఠ ఏకాదశి నాడు అన్ని ముఖ్య వైష్ణ వాలయాలలో ఉత్తర ద్వార దర్శనం సంప్ర దాయంగా కొనసాగుతోంది. తెలుగు నాట వెంక టాద్రి (తిరుమల), భద్రాద్రి, మంగళాద్రిలో ఈ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. అయితే మంగళాద్రి క్షేత్రంలో మాత్రమే ఈ ఉత్సవానికి ప్రత్యేకతతో కూడిన గుర్తింపు వుంది. అత్యంత విలువైన... ఓంకార నాద జనిత మైన బంగారు దక్షిణావృత శంఖుతో తీర్థప్రసాదాలను ఇవ్వడం ఈ క్షేత్ర విశిష్టత. ఈ కారణంగానే మంగళ గిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి ముక్కోటి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు విశేషంగా తరలివ స్తుంటారు.

మంగళగిరి సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మంగళాద్రి క్షేత్రంలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారి ఉత్తర ద్వారదర్శన భాగ్యం పది గంటలకు పైగా సాగుతుంది. ప్రత్యేకించి ఇక్కడ జరిగే ముక్కోటి వేడుకలకు మరో ప్రాధాన్యం కూడా జతక లిసింది. అత్యంత అరుదైన దక్షిణావృత శంఖు ఒక్క మంగళగి రిలో మాత్రమే ఉంది. దీంతో మంగళాద్రిలో జరిగే శ్రీ లక్ష్మీనృసిం హుని ఉత్తర ద్వార దర్శనానికి ఏటా ప్రజలు పోటెత్తుతారు. ముక్కోటి సందర్భంగా 9వ తేదీ గురువారం రాత్రి శ్రీవారిని జగ న్మోహినిగా అలంకరించి పుష్పక విమానంపై గ్రామోత్సవం చేస్తా రు. ఈ ఉత్సవానికి దుగ్గిరాల మండలం పెదపాలెంకు చెందిన వాసిరెడ్డి మల్లేశ్వరరావు శాశ్వత కైంకర్యపరులుగా వ్యవహరిస్తు న్నారు. అనంతరం అర్థరాత్రి నుంచి తెల్లవారుజామున అంటే పదవ తేదీ శుక్రవారం వేకువజామున మూడు గంటల వరకు శ్రీవారి మూలమూర్తికి తిరువంజనోత్సవం నిర్వహిస్తారు. ఈ తిరు వంజనానికి అతి కొద్ది మంది భక్తులను మాత్రమే అను మతిస్తారు. తిరువంజనం పూర్తవుతుండగానే.. శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీనృసింహస్వామి ఉత్సవ మూర్తులను బంగారు గరుడ వాహనంపై శోభాయమానంగా అలంకరించి ఉత్తర ద్వారంలోనికి ప్రవేశపెడతారు. ఈ వైకుంఠ దర్శనం శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగు తుంది. ఈ ఉత్సవానికి పెదపాలేనికే చెందిన వాసిరెడ్డి నాగార్జున శాశ్వత కైంకర్యపరులుగా వ్యవహరించనున్నారు. శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం కొనసాగుతుండగా.. మరోవైపు ఆలయ ముఖమం డపంలో బంగారు దక్షిణావృత శంఖుతో రాత్రి పది గంటల వరకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని మర్నాడు శనివారం కూడా శంకుతీర్థం అందజేయనున్నారు.

ముక్కోటి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు: ఎస్పీ సతీశ్‌కుమార్

మంగళాద్రిలో రెండు రోజులపాటు జరగనున్న ముక్కోటి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పీ సతీశ్‌కుమార్ తెలిపారు. దేవస్థానం అధికారులతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీశ్‌కుమార్ మాట్లాడుతూ ముక్కోటి ఉత్సవాలకు లక్ష మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, అందు కు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నామని చె ప్పారు. 60వేల మంది భక్తులు శంఖుతీర్థం తీసుకోవచ్చని అంచనా వేసి, వారి కోసం దేవస్థానం వారు ఉచిత క్యూలైను, రూ. వంద, రూ.200, వీఐపీ క్యూలైన్లను వేర్వేరుగా ఏర్పాటు చేశార న్నారు. 9వ తేదీ రాత్రి నుంచి పదో తేదీ రాత్రి వరకు 300 మంది పోలీసుసిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటార న్నారు. దేవస్థానానికి మూడువైపులా మూడుచోట్ల పార్కింగ్ స్థలాలను కేటాయించామని, భక్తులు పార్కింగ్ స్థలాల్లో వాహనాలను నిలుపుదల చేసి నడుచుకుంటూ రావాలని సూచించారు. ఉత్సవాలను విజయవం తంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్క రూ సహకరించాలని కోరా రు. కార్యక్రమంలో దేవ దాయశాఖ సహాయ కమిషనర్ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, అర్బ న్, రూరల్ సీఐలు డి.వినోద్‌కు మార్, వై.శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.





ఉత్సవ గ్రౌండులో ఏర్పాటుచేసిన క్యూలైన్లు, బంగారు దక్షిణావృత శంఖు

ధనుర్మాస వ్రత దీక్షలతో వెయ్యి జన్మల పుణ్యఫలం

- త్రిదండి చినజీయర్ స్వామి

భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న త్రిదండి చినజీయర్ స్వామి



గుంటూరు(తూర్పు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామికి అత్యంత ప్రీతికర మైన ధనుర్మాసంలో దీక్షలను ఆచరిస్తే వెయ్యి జన్మల పుణ్య ఫలం సిద్ధిస్తుందని శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారా యణ రామానుజ జీయర్ స్వామి అన్నారు. ధనుర్మా సాన్ని పురష్కరించుకుని స్థానిక గోరంట్ల శ్రీవేంకటేశ్వర స్వామి సొసై టీ(పెద్దగుడి)లో బుధవారం స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఐదువేల సంవ త్సరాల క్రితమే స్వామి వారిని నమ్మి గోదా దేవి పూజలు చేసింది. స్వామివారిని మానవ రూపంలోనే ఆయనకు పూజలు చేసిన పర మభక్తురాలు గోదాదేవి అని తెలియజేశారు. పాండవులు, శబరి, సుగ్రీవుడు దేవుడిని నమ్మి విజయాలు సాధిం చారు. కౌరవులు, వాలి, రావణాసురుడు, రాక్షసులు నమ్మక పోవడంతో నాశనమ య్యారు. ప్రత్యక్ష, విగ్రహ రూపంలోనైనా దేవుడిని నమ్మాలి. ధనుర్మాసాన్ని మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో దీక్షలు చేయాలి. అప్పుడే పుణ్యఫలం సిద్ధిస్తుంది. ఈ దీక్షల తోనే మహిళలకు సమాన హక్కులను పది దశాబ్దాల క్రితమే రామానుజ స్వామి వారు కల్పించారు. ఇప్పుడు హక్కుల కోసం మహి ళలు పోరాడటం బాధాకరం. రామానుజయ స్వామి కల్పించిన హక్కులతో మహిళలు ఉత్తేజంతో పనిచేయాలని అనుగ్రహ భాష ణం చేశారు. అంతకు ముందు స్వామీజీకి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ కంచ ర్ల ఆంజనేయులు, అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్ తదితరులు పర్యవేక్షించారు.

సాగునీటి ప్రక్షాళనకు శ్రీకారం

- నేడు ప్రాజెక్టు కమిటీ తొలి సమావేశం
- సత్తెనపల్లి జలవనరులశాఖ అతిథి గృహంలో నిర్వహణ
- కీలక నిర్ణయాలు తీసుకుంటేనే మేలంటున్న రైతులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగునీటి వ్యవస్థ ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన ఎన్నికల ద్వారా ఎన్నికైన సాగునీటి సంఘాలకు కాల్వల బాగు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన సాగునీటి వ్యవస్థను గాడిలో పెట్టేందుకు నీటి సంఘాలు కృషి చేయనున్నాయి. నాగార్జున సాగర్ జవ హర్ కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీ అధికారం చేపట్టాక తొలి సమావేశం గురువారం జరగనుంది. సత్తెనపల్లిలోని జలవన రుల శాఖ అతిథి గృహంలో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతా రావు అధ్యక్షతన జరిగే సమావేశానికి వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్య క్షులు, జలవనరుల శాఖ అధికారులు హాజరుకాను న్నారు. సమావేశంలో కాల్వల నిర్వహణ, నీటి సర ఫరా, మరమ్మతులు తదితర అంశాలపై చర్చించ నున్నారు. అధ్వాన కాల్వలపై సంఘాలు దృష్టి సారించాలి. నీటి సరఫరాలో తలెత్తుతున్న సమస్య లను గుర్తించి వాటి పరిష్కారానికి నడ్డుం కట్టా లి. కాల్వల నిర్వహణలో భాగస్వాములు కావాల్సిన గురుతర బాధ్యతను సంఘాలపై ప్రభుత్వం ఉం చింది. రైతులతో సంఘాలు మమేకం అవుతూ ఎప్పటికప్పుడు నిధులతో సంబంధంలేని సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రైతులు ఎన్నో ఆశలు.. ఎంతో నమ్మకంతో సంఘా లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైతుల నమ్మకం వమ్ము కానివ్వకుండా సంఘాల పాలన సాగాల్సి ఉంది. ఈ దిశగా సంఘాలు జలవనరుల శాఖ.. రైతుల మధ్య వారధిగా పనిచేయాల్సి ఉంది. ఏమాత్రం అలసత్యం.. నిర్ల క్ష్యం వహించినా సంఘాల ఎన్నికల లక్ష్యం నీరుగారి పోనున్నది. సంఘాలు నీటి సరఫరాలో రైతులకు పూర్తి భరోసాను ఇవ్వాల్సి ఉంది. చివరి భూములకు నీరు అందక పోవడానికి కారణాలను గుర్తిస్తే సదరు సమస్య పరిష్కారం పెద్ద పని కాదన్న వాదన రైతుల నుంచి వ్యక్త మవుతోంది. సంఘాలు అంకిత భావంతో పనిచేస్తే అన్న దాతలకు సాగు నీటి ఇక్కట్లు తప్పినట్లే.

సమావేశం అజెండా..

- డివిజన్ వారీగా జరుగుతున్న పనులు.
- 2025-26 సంవత్సరంలో నాగార్జున సాగర్ కుడికాల్వను సక్ర మంగా నడుపుటకు కావాల్సిన, చేపట్టాల్సిన పనులు
- డ్యాంలోని నీటి లభ్యతను బట్టి అనుసరించాల్సిన నీటి నియంత్ర ణ పద్ధతులు, వారబందీ అవ శ్యకత.
- కాంట్రాక్టు విధానంలో లస్కర్ల నియామకం.
- తూముల వద్ద షట్టర్లు ఏర్పాటు
- జిల్లాల సరిహద్దులలో నీటి నియంత్రణ ప్రణాళిక
- సభ్యులు ప్రస్తావించే ఇతర అంశాలపై చర్చ

రోజూ వెయ్యి క్యూసెక్కులు వృథా

నాగార్జున సాగర్ ప్రాజెక్టు ద్వారా విడుదల చేస్తున్న రోజూ నీటిలో 1,000 క్యూసెక్కుల నీరు వృథా అవుతు న్నట్లు జలవనరుల శాఖ లెక్కలు చెబుతున్నాయి. ప్రాజె క్టు నుంచి బుగ్గవాగు లోపు కాల్వకట్టల నుంచి ఊట రూ పంలో వెయ్యి క్యూసెక్కుల నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలి. కాల్వలకు నీరు విడుదల చేసేందుకు తూము లకు షట్టర్లు లేవు. దీంతో సాగు నీరు వృథాగా వాగుల్లో పారుతున్నది. షట్టర్లు లేని కారణంగా అవసరం లేని సమయంలో నీటి సరఫరాను మైనర్లకు నిలుపుదల చేసే అవకాశం లేకుండా పోతోంది. నీటి వృథాను అరికట్టేం దుకు కాల్వలకు షటర్ల ఏర్పాటు తక్షణావసరంగా ఉంది.

మరమ్మతులపై పర్యవేక్షణ అవసరం

కాల్వల మరమ్మతుల పనులను రెండు డివిజన్లలో చేపట్టారు. మరో మూడు డివిజన్లలో పనులు టెండర్ దశలో ఉన్నాయి. ఈ పనులపై సంఘాల పర్యవేక్షణ ఉంటేనే పూర్తిస్థాయిలో అవి జరిగే అవకాశం ఉంటుంది. సాగర్ లింగంగుంట్ల సర్కిల్ పరిధిలో 302 పనులను గుర్తించారు. ఈ పనులకు రూ.17.69 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. పూడికతీత, కంప చెట్లు, జమ్ము, తూటుకాడ తొలగింపు పనులు చేపట్టాల్సి ఉంది. లింగం గుంట్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 76 పనులకు వ్యయ అంచనా రూ.4.21 కోట్లు. మాచర్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 101 పనుల వ్యయ అంచనా రూ.4.69 కోట్లు. ఓఅండ్ఎం డివిజన్ సత్తెనపల్లి పరిధిలో 62 పనుల వ్యయ అంచనా రూ3.34 కోట్లు. లింగంగుంట్ల మానిటరింగ్ డివిజ న్ పరిధిలో 31 పనుల వ్యయ అంచనా రూ.3.65 కోట్లు. సిప్ట్ డివిజన్ వినుకొండ పరిధిలో 34 పనుల వ్యయ అంచనా రూ.1.78 కోట్లు. అయితే సత్తెనపల్లి, నరసరావుపేట లింగంగుంట్ల ఓఅండ్ఎం, వినుకొండ సిప్ట్ డివి జన్ల పరిధిలోని పనుల టెండర్లను చేశారు. మాచర్ల, లింగంగుంట్ల పనులు జరుగుతున్నాయి.

చిలకలూరి పేట మేజర్ కాలువలో పెరిగిన కంప



మోదీకి బ్రహ్మారథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం



విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనం పైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్

బహిరంగ సభకు హాజరైన అశేష జనం



పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

డంపింగ్ యార్డులో అగ్నిప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు

చిలకలూరిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మున్సిపాలిటి డంపింగ్ యార్డులో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు బుధవారం తెలిపారు. సీసీ కెమెరాల వైర్లు కత్తిరించి, డంపింగ్ యార్డులో నాలుగు చోట్ల నిప్పు పెట్టినట్లు గుర్తించినట్టు ఆయన వెల్లడించారు. ఉద్దేశ పూర్వకంగా డంపింగ్ యార్డుకు నిప్పు పెట్టినట్లుగా ఉందన్నారు. ఇందుకు బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

ప్రమాదకరంగా ప్రయాణాలు

బతుకుతెరువు కోసం పరిమితికి మించి ఆటోల్లో మిర్చి కూలీల ప్రయాణం





పరిమితికి మించి మిర్చి కోతలకు కూలీలను తరలిస్తున్న ఆటోలు

వినుకొండ టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బతుకు తెరువుకోసం ఎన్నో తిప్పలు... సూర్యుడు అస్తమించకముందే ఇంటి నుంచి కాలు బయట పెట్టిన ఆ కూలీలు నిత్యం కూలి పనుల కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పొలం పనులకు వెళ్ళాల్సిన పరిస్థితి పట్టణంలో నెలకొని ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అత్యధికంగా బొల్లాపల్లి మండలంలో మిర్చిపంటను రైతులు సాగుచేస్తున్నారు. రబీ సీజన్‌లో మిరప కాయల కోతకు మంచి డిమాండ్ ఏర్పడింది. మిరప కాయలు కోసేందుకు వయస్సుతో సంబంధం లేకుండా కూలి పనులు కోసం పొలాల బాట పడుతున్నారు. వినుకొండకు సుమారు 10 నుంచి 20 కిలోమీటర్లు ప్రయాణిస్తే కాని కూలి పనులు దొరకని పరిస్థితి. దీంతో ఆర్టీసీ బస్సులు ఆ రహదారుల్లో ఉండవు. అవి ఉన్నా వీరి పొలాలకు వెళ్లే సమయానికి పొలానికి చేరుకోలేరు. దీంతో పొట్టకూటి కోసం ఆతృతతో ఆటోలపై ప్రయాణించాల్సి వస్తోంది. ప్రతి సంవత్సరం కోతల సమయంలో ఆటోలు ప్రమాదాలకు గురై ఒకరు, ఇద్దరు మృత్యువాత పడుతున్నారు. సీజన్ వచ్చిందంటే ఆటోల్లో ప్రయాణిస్తున్న కూలీలకు ఎప్పుడు ఏమవుతుందోనన్న భయం వారిలో నెలకొని ఉంది. అధికారులు మితిమీరిన వేగంతో, నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణిస్తున్న ఆటోలపై అధికారులు దృష్టిసారించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పారిశుధ్య పనులపై కమిషనర్ ఆకస్మిక తనిఖీ

చిలకలూరిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబు బుధవారం ఆకస్మిక తనిఖీచేశారు. వేలూరు రోడ్డులోని మర్రిచెట్టు ప్రాంతం, శారదహైస్కూల్, శ్మశాన వాటిక, చార్లెస్ కాన్వెంట్ తదితర ప్రాంతాలలో పారిశుధ్య పనుల నిర్వహణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శానిటరీ మేస్త్రులు, శానిటరీ సెక్రటరీలకు పలు సూచనలు చేశారు, పారిశుధ్య పనుల నిర్వహణను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పారిశుధ్య పనుల నిర్వహణపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, బాధ్యతతో వ్యవహరించి పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛ చిలకలూరిపేట లక్ష్యంగా పనులు చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన 9 వార్డు పరిధిలోని వాసవి నగర్‌లోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులను, నీటి సరఫరాను పరిశీలించారు. 12వ వార్డు పరిధిలో ఉన్న ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు.

11న సంక్రాంతి సంబరాలు

నరసరావుపేట కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసరావుపేట కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీలలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు బుధవారం కళావేదిక నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కళావేదిక నిర్వాహకులు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రికను ఆవిష్కరించారు. రెండ్రోజులపాటు జరిగే సంబరాల్లో భాగంగా మొదటి రోజు నాగపూర్‌కు చెందిన సాయి నటరాజ అకాడమి ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన, రెండో రోజు మ్యాజిక్ లెజండ్ బి.ఎస్.రెడ్డి ఇంద్రజాల ప్రదర్శన, దాక్షిణ్య ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఇంటలెక్చువల్లీ డిజేబుల్స్, గుంటూరు వారి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కళావేదిక వ్యవస్థాపకులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, గిరిరాజు అయ్యపరాజు, గోపాల్‌బాబు, స్వర్ణ రామిరెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషిచేయాలి: వేమన రెడ్డి

యడ్లపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషిచేయాలని అందులో భాగంగా ప్రతి విద్యార్థి మొక్కలు నాటి పరిరక్షించాలని రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షుడు ఆళ్ళ వేమన రెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సీడ్ బాల్స్ (విత్తనాల బంతులు) తయారుచేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి 500సీడ్‌బాల్స్ తయారుచేసి వర్షాలు పడిన సమయంలో కొండ ప్రాంతాలు, బంజరు భూముల్లో చల్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో అరుణకుమారి, ప్రధానోపాధ్యాయుడు ఏవీ నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఎంపీడీవో తనిఖీ

బొల్లాపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు, నాయుడుపాలెం, కనమలచెరువు గ్రామాల్లో ఎంపీడీవో పీ సీతారామయ్య ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సచివాలయాల్లో సిబ్బంది సమన్వయం చేసుకొని వచ్చిన వారికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, సురేష్ పాల్గొన్నారు.

రంగోత్సవ్‌లో కొండవీడు యూపీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

యడ్లపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీల్లో కొండవీడు యూపీ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. బోయపాలెం జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు బుధవారం నిర్వహించారు. క్విజ్, రంగోలి, ఫోక్ డ్యాన్స్, డిజిటల్ కొలేజి తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన సుమారు 200మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. క్విజ్ పోటీలలో పాల్గొన్న పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎం.సాయి, ఎ.చరణ్, షేక్ హఫీసాకౌసర్‌ల టీం ప్రథమస్థానం, ఫోక్‌డ్యాన్స్‌లో షేక్ ఫరహాన్, కె.స్మైలీ, షేక్ రూహిబాను, షేక్ హఫీషా, డి.నవ్యల బృందం ద్వితీయస్థానం పొందారు. కాగా డిజిటల్ కొలేజి పోటీలలో ఎం.సాయిచరణ్ ద్వితీయ బహుమతి, రంగోలి పోటీలలో వై.వర్ష, వి.కావ్య, డి.శ్రీలక్ష్మి, జె.శశిలీలల టీం తృతీయ బహుమతిని సాధించారు. రంగోత్సవ్ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులను హెచ్ఎం గోరంట్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు. క్విజ్ పోటీలలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు ఈ నెల 24న జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు.

13న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చిలకలూరిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎన్ఎస్‌సీవీఎస్ కళాశాల, ఎస్‌సీవీఎస్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈ నెల 13న పసుమర్రులోని కళాశాలలో జరుగుతుందని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు తాళ్ల అంజిరెడ్డి బుధవారం తెలిపారు. పూర్వ విద్యార్థులు సమ్మేళనానికి హాజరు కావాలని కోరారు.

పింఛన్‌దారుల అర్హతలపై అధికారుల బృందం తనిఖీ





మునమాక, ఈపూరులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న తనిఖీ బృందం

రొంపిచర్ల, జనవరి 8 (ఆంధ్రజోతి): మండలంలోని పలు గ్రామాల్లో రూ.15వేలు పింఛన్ తీసుకుంటున్న వారిని అధికారుల బృందం బుధవారం తనిఖీ చేసింది. అలవాల, మునమాక, వడ్లమూడివారిపాలెం, తుంగపాడు, రొంపిచర్ల, వీరవట్నం, అన్నవరప్పాడు, బుచ్చిపాపన్నపాలెం, ఆరేపల్లి, గోగులపాడు, ఎడ్వర్డుపేట, విప్పర్ల, రెడ్డిపాలెం, సంతగుడిపాడు గ్రామాల్లో తనిఖీ బృందం పర్యటించింది. వారి వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. రాజకీయ నాయకులు తనిఖీల వద్దకు రావద్దని సంబంధిత బృందం పేర్కొంది. వివరాలను బయటకు వెల్లడించలేదు. నివేదికలను తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో మాధ్యూబాబు, ఏపీఎం సోమశేఖర్, స్థానిక వైద్యాధికారులు, డ్వాక్రా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈపూరు మండలంలో...

ఈపూరు,జనవరి8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో దివ్యాంగుల విచారణ బుధవారం చేపట్టారు. ప్రత్యేక విచారణ బృందం ప్రతి లబ్దిదారుడి ఇంటికి వెళ్ళి ధృవపత్రాలను తనిఖీ చేశారు. దివ్యాంగులను పరిశీలించారు. మొత్తం 23 మంది నూరుశాతం దివ్యాంగత్వం ఉన్నవారిని పరిశీలించి ధృవపత్రాలను తనిఖీ చేశారు.బృందంలో వైద్యులు వరుణ్,రోశయ్య, నాగేంద్రబాబు, ఎంపీడీవో కే ప్రభాకరరావు, ఏపీఎం రంగారెడ్డి, సీసీలు ఉన్నారు.

పీహెచ్‌సీలో 24గంటలూ వైద్యసేవలు అందించాలి

డీఎంహెచ్‌వో రవి



శావల్యాపురంలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవి

శావల్యాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బంది రోగులకు 24 గంటలపాటు వైద్యసేవలను అందించాలని పల్నాడు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి రవి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులు, ఓపీలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల, ఆర్‌పీహెచ్‌కే సర్వేల పురోగతి, సాధారణ కాన్పులు, సిబ్బంది పనితీరు, సమయపాలన, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలు పరిశీలించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ హెచ్ఎంపీవీ వైరస్‌పై ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పీహెచ్‌సీలో సిబ్బంది కొరత కారణంగా నిలిచిపోయిన రాత్రి డ్యూటీలను పునరుద్ధరించాలని, 24గంటలూ రోగులకు వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. సాధారణ కాన్పులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ఆశా వర్కర్లు గర్భిణులకు వివరించి పీహెచ్‌సీలో సాధారణ కాన్పుల సంఖ్యను గణనీయంగా పెంచాలన్నారు. పీహెచ్‌సీ పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. 104 ప్రోగ్రాం ఆఫీసర్ హనుమకుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి రావిపూడి రమ్య, సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్ నర్సులు లక్ష్మీప్రసన్న, ప్రమీళ, ల్యాబ్ టెక్నీషియన్‌లు సీతారామయ్య, సతీష్, ఫార్మసిస్ట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.300 వచ్చేలా ప్రతి ఒక్క కూలీకి పని కల్పించాలి

● ఎంపీడీవో పుట్టారెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పుట్టారెడ్డి

వినుకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల ద్వారా రైతులకు మేలు జరిగేలా కూలీలకు పని కల్పించాలని వినుకొండ ఎంపీడీవో పుట్టారెడ్డి అన్నారు. స్థానిక ఎంపిడీవో కార్యాలయంలో జాతీయ ఉపాధిహామీ పథకం క్షేత్రస్థాయి సహాయకులకు, సీనియర్ మేట్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పుట్టారెడ్డి మాట్లాడుతూ ఉపాధిహామీ ద్వారా రైతులకు మేలు జరిగేలా పనిచేయాలని, ఆ ఫలితాలు ఆరు నెలల్లో కనిపించాలన్నారు. ప్రస్తుత సీజన్ ఉపాధిహామీ పనులకు అనుకూలమైందన్నారు. అందువలన రైతు భూముల్లో నీటి కుంటలతోపాటు పంచాయతీలో ఒక చెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ప్రయోజనం చేకూరుతున్నప్పుడు కూలి పనులకు రైతులు ముందుకు వస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రూ.300 వేతనం వచ్చేలా ఫీల్డు అసిస్టెంట్లు మార్కింగ్ చూపి కొలతల ప్రకారం పనిచేయించాలని సూచించారు. ఆ దిశగా ఎఫ్ఏలు పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో శావల్యాపురం ఎంపీడీవో సీతరామయ్య, ఈవోపీఆర్‌డీ సుందరరెడ్డి, ఏపీవో కట్టా నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'కిషోరి వికాసం'ను సద్వినియోగం చేసుకోవాలి

● వినుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో అనూరాధ

పోట్లూరు (శావల్యాపురం) జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు, బాలికలకు మెరుగైన భవిష్యత్తును అందించేందుకు ప్రభుత్వం రూపొందించిన కిషోరి వికాసం కార్యక్రమాన్ని మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని వినుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ముదివర్తి అనూరాధ అన్నారు. మండలంలోని పోట్లూరులో కిషోరి వికాసం కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. సీడీపీవో మాట్లాడుతూ ఒన్ స్టాప్ సెంటర్ ద్వారా ఆపదలో ఉన్న బాలికలకు, మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని, కష్టాల్లో ఉన్న బాలికలు, మహిళలంతా చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098, మహిళ హెల్ప్‌లైన్ నెంబర్లు 181, 112లకు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రజలంతా బాల్య వివాహాలు నిరోధించాలని, బడి మానేసిన పిల్లలకు, తల్లిదండ్రులకు బేటీ బచావో, బేటీ పడావో ఆవశ్యకతను తెలియజేసి వారిని పాఠశాలలకు పంపాలన్నారు. మహిళల శక్తి, సామర్థ్యాలను గుర్తించి సమాజంలో వారికి ప్రాధాన్యతనివ్వాలన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత, అంగనవాడీటీచర్లు అరుణ, విజయలక్ష్మి, శేషుకుమారి, హేనాగ్రేస్, గోవిందమ్మ, భాగ్యలక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో ధనుర్మాస ప్రత్యేక పూజలు



వెంకటేశ్వరస్వామి దేవాలయంలో వెయ్యి గంగాళాలతో స్వామివారికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

వినుకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస పూజా కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలోని మెయిన్ బజారులోని త్రిదండి శ్రీమన్నారాయణ చిన్నజీయర్‌స్వామి ఆలయంలో 108 మంది మహిళలతో దీపారాధన హారతులు వెలిగించి స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహకులు మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన గుడారై ఉత్సవం 108 గంగాళాలతో పాయసం నివేదన జరుగుతుందని, 13వ తేదీన భోగినాడు గోదారంగనాథుల కల్యాణం వైభవపేతంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సనిశెట్టి సీత, కొల్లిపర రాణి, అచ్యుత లక్ష్మి, కల్యాణి, చండి, రాజ్యలక్ష్మి, అరుణ, సనిశెట్టి వీరాంజనేయులు, అప్పలరాజు, ఉప్పల ప్రకాశ్, సనిశెట్టి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి దేవాలయంలో...

పట్టణంలోని అలివేలుమంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో కుడారై పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. 26 రోజులుగా ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో గోదాకృష్ణుని పూజలుతోపాటు 27వ రోజు కుడారై పూజలు నిర్వహించినట్లు ప్రధాన అర్చకులు శ్రావణ్‌కుమార్ తెలిపారు. అనంతరం వెయ్యి గంగాలాలతో పొంగల్లు పంపిణీచేశారు.

బొప్పూడి హైస్కూలుకు కంప్యూటర్ బహూకరణ

చిలకలూరిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం బొప్పూడిలోని ఎస్‌పీఎస్ అండ్ జీవీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బెస్ట్ రన్నర్స్ సంస్థ (అమెరికా) అధినేత తూబాటి కిషోర్ కుమార్ బుధవారం కంప్యూటర్‌ను బహూకరించారు. సంస్థ టీం సభ్యులు పావని ద్వారా ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లుకు దీనిని అందచేశారు. కార్యక్రమంలో ఎంఈవో కె.లక్ష్మి, చైర్మన్ క్రాంతికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

నరసరావుపేట టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని పాతూరులో ఉన్న ప్రత్యేక అవసరాల గల పిల్లల భవిత పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా సీనియర్ టీడీపీ నాయకుడు కొల్లి బ్రహ్మయ్య, వీహెచ్‌పీఎస్ కర్నాటి కృష్ణమూర్తి, ఎస్‌బీఐ మేనేజర్ రామరావు, ఐఈడీ కో-ఆర్డినేటర్ సెల్వరాజు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

నాదెండ్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలోని కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. ఎస్‌టీయూ సీనియర్ నాయకుడు దివంగత మదన్ మోహన్ కుమార్తె సింగ్ నాగమల్లేశ్వరి, ఆమె భర్త తూబాటి శ్రీహరిరావుల ఆర్థిక సాయంతో ఈ స్టడీ మెటీరియల్‌ను 160 మంది విద్యార్థులకు అందజేశారు. ఎస్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే కోటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాదు, ఆర్థిక కార్యదర్శి వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు ఐ.కృష్ణానాయక్ పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని జిల్లా వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు ఎస్‌టీయూ వారి 10వ తరగతి స్టడీ మెటీరియల్‌ను గంగినేని ఫౌండేషన్ అధినేత, డీసీ చైర్మన్ గంగినేని రాఘవ రాఘవ సహకారంతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రజిత్ యాదవ్, విద్యా కమిటీ చైర్మన్ ఏ కృష్ణ, బేతపూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● యూటీఎఫ్ ఆధ్వర్యంలో 110 మంది విద్యార్థులకు 10 తరగతి మోడల్ పేపర్లను గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంగినేని రాఘవ పంపిణీ చేశారు. ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలో మొత్తం 110 మంది 10వ తరగతి విద్యార్థులకు మెటీరియల్ పంపిణీచేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఈవో పార్వతి పాల్గొన్నారు.

విద్యావికాస్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

వినుకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కారంపూడిరోడ్డులోని విద్యావికాస్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి వినుకొండ నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు మక్కెన మల్లికార్జునరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ తిరుమలశెట్టి బాలయ్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాల్వ భూముల ఆక్రమణలపై చర్యలు

● ఎన్ఎస్‌పీ ఈఈ ప్రేమ్‌కుమార్

ఫటా ఫట్



వినుకొండ టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మేజర్ పరిధిలోని మైనర్ కాల్వల భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుంటామని ఎన్ఎస్‌పీ ఈఈ ప్రేమ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతికి వెల్లడించిన వివరాలు.

ప్రశ్న: వెల్లటూరు రోడ్డులోని పెట్రోల్ బంక్ సమీపంలో కాల్వ కట్టల ఆక్రమణలపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: మైనర్ కాల్వలను ఆక్రమించి గతంలో భూములను వెంచర్లుగా ఏర్పాటుచేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, త్వరలో డీఈల సాయంతో పూర్తి సమాచారాన్ని సేకరించడం జరుగుతుంది.

ప్రశ్న: ఆక్రమణకు గురైన ఎన్ఎస్‌పీ స్థలాలపై చర్యలేమి తీసుకుంటున్నారు?

జ: డివిజన్ పరిధిలో ఎక్కడైనా ఎన్ఎస్‌పీకి సంబంధించిన ఆస్తులు ఆక్రమణలకు గురైతే నా దృష్టికి తీసుకురండి. ఈపూరు మండలం వినుకొండ పరిధిలోని భూములు వాటియొక్క స్థితిగతులపై వివరాలను సేకరిస్తున్నాం.

ప్రశ్న: మేజర్ కాల్వల ద్వారా చివరి భూములకు నీరు అందిస్తారా?

జ: గతంలో డివిజన్ పరిధిలోని మేజర్ కాల్వలకు మరమ్మతులు చేపట్టాం. మిగిలిన పనులను నూతన డీసీల సాయంతో పనులు పూర్తిచేస్తాం.

ప్రశ్న: కాల్వల స్థితిగతులు ఎలా ఉన్నాయి?

జ: మేజర్ కాల్వలపై కనీసం వాహనాలు కూడా వెళ్ళే పరిస్థితి లేదు. కాల్వల్లో మరమ్మతులతోపాటు జంగిల్ క్లియరెన్స్ కోసం ప్రణాళికలు తయారుచేస్తున్నాం. రానున్న వేసవి కాలంలో పనులు ప్రారంభిస్తాం.

ప్రశ్న: మేజర్ కాల్వల మరమ్మతులకు ఎన్ని కోట్లు నిధులు అవసరం?

జ: ఇప్పటికే అంచనాలు తయారుచేశాం. పెరుమాళ్ళపల్లి మేజర్‌కు రూ.16.96లక్షలు, ఇనిమెళ్ళకు రూ.4.8లక్షలు, ఐనవోలుకు రూ.27.09లక్షలు, త్రిపురాపురంకు రూ.38.25లక్షలు, నూజండ్లకు రూ.20.07లక్షలు, జమ్మలమడుగుకు రూ.24.29లక్షలు, వేములకు రూ.3.43లక్షలు, చీకటీగలపాలెం రూ.19.36లక్షలు, పేరూరుపాడు రూ.7.7లక్షలు, దొండపాడు మేజర్లకు రూ.9.85లక్షలు మొత్తం రూ.173.04లక్షలతో పనులు చేపడతాం.

దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌కు పల్నాడు విద్యార్థి



ప్రాజెక్టుతో విద్యార్థి దిలీప్

నరసరావుపేట కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత సైన్స్ ఫెయిర్ 2024-25 కు పల్నాడు జిల్లా దాచేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దిలీప్ తయారుచేసిన ప్రాజెక్టు ఎంపికైనట్లు పల్నాడు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.రాజశేఖర్ బుధవారం తెలిపారు. రెండ్రోజులపాటు విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో దిలీప్ ప్రదర్శించిన అంబూ బ్యాగ్ ప్రాజెక్టును పరిశీలకులు జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు చెప్పారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సమగ్ర శిక్ష సంచాలకులు బి.శ్రీనివాసరావు, ఎస్సీఆర్టీ డైరక్టర్ ఎం.కృష్ణారెడ్డి దిలీప్‌కు మెమోంటో అందజేసినట్లు తెలిపారు. కాగా ఈ నెల 20న పాండిచ్చేరిలో జరిగే దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌లో దిలీప్ పాల్గొంటాడని చెప్పారు. ఎంపికైన విద్యార్థిని, గైడ్ టీచర్ ప్రసాద్‌ను కలెక్టర్ పి.అరుణ్ బాబు, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అభినందించారు.



విజేతలుగా నిలిచిన వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు

డిగ్రీ విద్యార్థులకు సంక్రాంతి ఆటల పోటీలు

వినుకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని గంగినేని కల్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఇంటర్ విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో నియోజకవర్గంలోని ఆదర్శ పాఠశాలలు, కస్తూర్బా, వినుకొండ జూనియర్ కళాశాలలకు చెందిన మొత్తం 158మంది విద్యార్థినులు 79టీమ్‌లుగా పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన బి.ఏసమ్మ, జె.శ్రీవల్లిలు మొదటి బహుమతి, చీకటీగలపాలెం మోడల్ స్కూల్‌కు చెందిన ఓ.నాగేశ్వరి, అబిదేవికలు ద్వితీయ బహుమతి, శావల్యాపురం మహిళ జూనియర్ కళాశాలకు చెందిన వి.తులసి ఆర్.స్వాతిలు తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు డాక్టర్లు పల్లవి, సీహెచ్ శిరీష, తిప్పిశెట్టి మహేష్ రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు బహుమతులను పంపిణీచేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, న్యాయనిర్ణేతలు దేవతి, శైలజ, ఖజ్జాయం విజయలక్ష్మిలతోపాటు అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.